ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 129, పేజీలు - 08

మంగళవారం, నవంబర్ 10, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD





అప్పుల భారం.. అభివృద్ధి లక్ష్యం!

రైతన్న ఆత్మీయ సభలో సీఎం రేవంత్ రెడ్డి

- తెలంగాణను దేశంలోనే నంబర్ వన్‌గా నిలుపుతాం - పాలమూరు వలసలకు ముగింపు పలుకుతాం
- కొడంగల్‌కు కృష్ణా జలాలు తెస్తాం - సునామీలో మోడీ, కేడీ కొట్టుకుపోవాలి
- సంక్రాంతి తర్వాత 'ప్రజాబలం' - రాష్ట్రవ్యాప్తంగా తిరిగి సునామీ సృష్టిస్తాన్న సీఎం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సంక్రాంతి తర్వాత రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుంటానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. 'ప్రజాబలం' కార్యక్రమం ద్వారా జిల్లాలన్నీ తిరిగి ప్రజలతో మమేకమవుతానని చెప్పారు. రాష్ట్రంలో సునామీ సృష్టిస్తానని ఆ సునామీలో మోదీ, కేడీ కొట్టుకుపోవాలని వ్యాఖ్యానించారు. వికారాబాద్ జిల్లా హకీంపేట్‌లో 'రైతన్నతో ఆత్మీయ సభ' పేరుతో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా తన రాజకీయ

2లో..

ఐదు రాష్ట్రాల ఎన్నికలకు ఈసీ సిద్ధం

– నోటిఫికేషన్‌కు ముహూర్తం ఫిక్స్



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) 2029 సార్వత్రిక ఎన్నికలకు సెమీ ఫైనల్ గా భావిస్తున్న యూపీ, ఉత్తరాఖండ్, పంజాబ్, గోవా, మణిపూర్ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) సిద్ధమవుతోంది. త్వరలో గడువు పూర్తిచేసుకుంటున్న ఆయా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఇందుకు ముహూర్తం కూడా ఖరారు చేసినట్లు తెలుస్తోంది. జనవరిలో ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికలపై ఈసీ ప్రకటన వెలువడే అవకాశం ఉంది. నవంబర్ చివరి వారంలో ఎన్నికలు జరిగే యూపీ, ఉత్తరాఖండ్, పంజాబ్, గోవా, మణిపూర్ లో కేంద్ర ఎన్నికల ప్రధాన

2లో..

కలెక్టర్‌కు 6 నెలల జైలుశిక్ష

తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు

- రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి 6 నెలల జైలు శిక్ష
- రూ.2 వేల జరిమానా విధించిన హైకోర్టు
- కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లు నిర్ధారణ
- 60 రోజుల్లో నిర్ణయం తీసుకోవాలన్న ఆదేశాలు బేఖాతరు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రంగారెడ్డి కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఉద్దేశపూర్వకంగా కోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయలేదని తేల్చిన తెలంగాణ హైకోర్టు ఆయనకు ఆరు నెలల సాధారణ జైలు శిక్ష విధించింది. దీంతోపాటు రూ.2 వేల జరిమానా చెల్లించాలని ఆదేశించింది. అయితే తీర్పుపై అప్పీల్ చేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ శిక్ష అమలును నాలుగు వారాల పాటు నిలిపివేస్తున్నట్లు జస్టిస్ కె.లక్ష్మణ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. రిజిస్ట్రేషన్ చట్టం–1908లోని సెక్షన్ 22–ఏ ప్రకారం నిషేధిత ఆస్తుల

2లో..



హే రామ్.. సేవ్ ఆంధ్రా

– వైఎస్ జగన్ సంచలన ట్వీట్

అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. సోషల్ మీడియా వేదికగా చంద్రబాబును లక్ష్యంగా చేసుకుని చేసిన ఓ ట్వీట్ రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీసింది. 'గొర్రెతోలు కప్పుకున్న తోడేలు, చంద్రబాబు ఒకటే' అంటూ జగన్ ఘాటుగా వ్యాఖ్యానించారు.

3లో..

ప్రజా తీర్పుతో కూటమికి కొండంత బలం


– మరో 30 ఏళ్ల నాయకత్వానికి బీజమన్న సీఎం రేవంత్

- 58.9 శాతం ఓట్లతో తిరుగులేని ఆధిపత్యం, వైసీపీకి భారీ ఎదురుదెబ్బ - 100 పట్టణ స్థానిక సంస్థల్లో 94 కూటమికి, 659 జెడ్పీటీసీలకు 575 కైవసం
- మహిళలు, బీసీలు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, యువతకు పెద్దపీట - ఓటములపై సమీక్ష.. తప్పులు సరిదిద్దుకుంటాం
- రెబల్స్‌కు నో ఎంట్రీ: సీఎం చంద్రబాబు

అమరావతి (ప్రశ్న న్యూస్) ప్రజా తీర్పు స్పష్టం.. కూటమి ఆధిపత్యం సుస్పష్టం! స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి తిరుగులేని విజయాన్ని నమోదు చేసింది. పట్టణాల నుంచి పల్లెల వరకు.. ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకు.. అన్ని ప్రాంతాల్లోనూ కూటమి జెండా రెపరెపలాడింది. రెండున్నరేళ్ల పాలన, అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనకు ప్రజలు పట్టం కట్టారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వచ్చిన ఓట్ల శాతంతో పోలిస్తే స్థానిక ఎన్నికల్లో కూటమి ఓట్ల వాటా 3.6 శాతం పెరగడం ప్రభుత్వంపై పెరిగిన ప్రజాభిమానానికి నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ, పరిషత్ ఎన్నికల్లో కలిపి 58.9 శాతం ఓట్లను కూటమి సాధించగా, వైసీపీ 33.56 శాతానికే పరిమితమైంది. గత ఎన్నికల్లో 39.81 శాతం ఓట్లు సాధించిన వైసీపీ ఈసారి 6.25 శాతం కోల్పోవడం రాజకీయంగా ఆ పార్టీకి గట్టి ఎదురుదెబ్బగా మారింది.స్థానిక ఎన్నికల ఫలితాలపై సోమవారం అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో చంద్రబాబు గణాంకాలతో సహా కూటమి విజయ ప్రస్థానాన్ని వివరించారు. ప్రజలు పార్టీలను మాత్రమే కాకుండా అభ్యర్థుల వ్యక్తిత్వం, సామాజిక నేపథ్యం, ప్రజాసేవ పట్ల నిబద్ధతను కూడా పరిశీలించి ఓటు వేశారని అన్నారు. గుడ్ గవర్నెన్స్ లీడ్స్ టు గుడ్ పాలిటిక్స్ అన్నది తమ విధానమని, ప్రజల కోసం కష్టపడితే ప్రజలు వెన్నంటే ఉంటారన్న విషయం ఈ ఫలితాలతో మరోసారి నిరూపితమైందని చెప్పారు.

పట్టణాల్లో కూటమి క్లీన్ స్వీప్ దిశగా

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభంజనం సృష్టించింది. మొత్తం 100 మేయర్, చైర్‌పర్సన్ పదవులకు గాను 94 స్థానాలను కైవసం చేసుకుంది. 13 మేయర్ పదవుల్లో 12, 87 చైర్‌పర్సన్ పదవుల్లో 82 దక్కించుకుంది. వీటిలో తెలుగుదేశం 70,



జనసేన 20, బీజేపీ నాలుగు పదవులను సాధించాయి. మొత్తం 3,941 వార్డులకు గాను 3,233 వార్డుల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. అంటే 82 శాతం వార్డులు కూటమి ఖాతాలోకి వెళ్లాయి.

3లో..

జిల్లాల్లోనే సమగ్ర వైద్యం

– వైద్య విధాన పరిషత్ బలోపేతంపై మంత్రి దామోదర సమీక్ష
– జిల్లాకో డీసీహెచ్ఎస్ కార్యాలయం ఏర్పాటుకు కసరత్తు
– కమ్యూనిటీ నుంచి జిల్లా ఆసుపత్రుల వరకు ఆధునికీకరణ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లోని సచివాలయంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ పునర్వ్యవస్థీకరణపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి జిల్లాలో డీసీహెచ్ఎస్ కార్యాలయాల ఏర్పాటు, సెకండరీ హెల్త్ కేర్ వ్యవస్థ బలోపేతం అంశాలపై ఆయన వివరంగా సమీక్షించారు.జిల్లాల్లోనే అన్ని రకాల వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. చిన్న చిన్న అనారోగ్య సమస్యలకు కూడా ప్రజలు హైదరాబాద్‌కు వెళ్లాల్సిన పరిస్థితి తగ్గాలని ఆయన అన్నారు. దీనికోసం కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రుల

2లో..

రాష్ట్రంలో జనవరి 25 నుంచి జనగణన

– జనవరి 10 నుంచి సెల్ఫ్ ఎన్యుమరేషన్, నోటిఫికేషన్ జారీ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో జనగణన–2027 నిర్వహణకు తేదీలు ఖరారు చేశారు. రాష్ట్రంలో రెండో విడతలో భాగంగా జనాభా లెక్కల సేకరణను వచ్చే ఏడాది జనవరి 25వ తేదీ నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు చేపట్టనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీఓ ఎంఎస్ నంబర్ 155ను జారీ చేసింది. కేంద్ర హోంశాఖ పరిధిలోని రిజిస్ట్రార్ జనరల్, సెన్సస్ కమిషనర్ కార్యాలయం విడుదల చేసిన నోటిఫికేషన్‌ను తెలంగాణ గెజిట్‌లో ప్రభుత్వం పునఃప్రచురించింది. జనగణనలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల వివరాలను సేకరించనున్నారు. ఇందుకు ముందు ప్రజలకు స్వీయ జనగణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) చేసుకునే అవకాశం కల్పించారు. జనవరి 10వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ఈ సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియ కొనసాగనుంది.

3లో..

అనుమతులు ఓక చోట నిర్మాణాలు మరోచోట

అధికారుల అండతో అక్రమ ఎన్ఓసీల జారీ.?

- మారేడ్‌పల్లిలో భూ వివాదం
- జీహెచ్ఎంసీ అనుమతులపై అనేక అనుమానాలు
- న్యాయస్థానంలో కేసు ఉన్న భూములపై నిరభ్యంతర (ఎన్ఓసి) పత్రాలు జారీ చేశారనే ఆరోపణలు
- సర్కిల్-44 ఏసీపీ, జోనల్ సీపీ, జోనల్ కమిషనర్ల పర్యవేక్షణ ఉండదా.? లంచాలకు అమ్ముడు పోయారా.?
- ఒకవైపు హైకోర్టు తీర్పు, మరోవైపు నిర్మాణాలకు అనుమతుల వ్యవహారం
- నకిలీ పత్రాలతో కోట్లాది రూపాయల భూమిపై కన్ను..
- అమాయక కొనుగోలుదారులే లక్ష్యమా.?
- మహాలక్ష్మి నిర్మాణ సంస్థ పేరుతో బహుళ అంతస్తుల భవనాలు..
- అధికారుల పాత్రపై విచారణకు డిమాండ్
- జీహెచ్ఎంసి సర్కిల్--44, సికింద్రాబాద్ జోన్ అధికారుల బాధ్యతరాహిత్యం, అవినీతిపై ఏసీబీ, విజిలెన్స్ విచారణకు బాధితుల డిమాండ్

2లో..



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిస్తేనే అభివృద్ధి సాధ్యం

– రూ.4 కోట్ల పనులకు బండి, పొన్నం శంకుస్థాపన



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాజకీయాలు ఏవైనా సరే, ఎన్నికలు ముగిశాక ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే నాయకుల ప్రధాన బాధ్యత అనే సూత్రాన్ని నిరూపిస్తూ కరీంనగర్ పట్టణాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేతులు కలిపాయి. కరీంనగర్ రూ.4 కోట్ల వ్యయంతో చేపడుతున్న పలు అర్బన్ డెవలప్‌మెంట్ పనులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, నగర మేయర్ సునీల్ రావు

3లో..

శాంతి పునరుద్ధరణే భారత్ ధ్యేయం

– జెలెన్‌స్కీకి ప్రధాని మోదీ ఫోన్



2లో..

అప్పుల భారం.. అభివృద్ధి లక్ష్యం!

ప్రయాణం, ప్రజలు తనకు ఇచ్చిన అవకాశాలు, పాలమూరు ప్రాంత అభివృద్ధి, గత ప్రభుత్వ పాలన, ఉద్యోగుల జీతాలు, జర్నలిస్టుల సమస్యలపై రేవంత్‌రెడ్డి మాట్లాడారు. “దేవుడు నాకు అన్ని పదవులూ ఇచ్చాడు. ప్రజలు నన్ను ఆదరించి ముఖ్యమంత్రి స్థాయికి తీసుకొచ్చారు. ఇక ప్రజలకు తిరిగి ఇవ్వాల్సిన బాధ్యత నాపై ఉంది” అని పేర్కొన్నారు.పాలమూరు ప్రజలు తనను ఎంపీగా గెలిపించినప్పుడు కేసీఆర్ ఆ ప్రాంత రుణం తీర్చుకుంటారని ఆశించామని కానీ ఆయన ప్రజలను నిరాశపరిచి గజ్వేల్‌కు వెళ్లారని రేవంత్‌రెడ్డి విమర్శించారు. పాలమూరు నుంచి ఎంతోమంది నాయకులు, మంత్రులు వచ్చినా వలసలు మాత్రం ఆగలేదన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో జరిగే ప్రాజెక్టుల నిర్మాణ పనులకు పాలమూరు ప్రజలు కూలీలుగా వెళ్లాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాలు గడిచినా ఈ ప్రాంతంలోని సాగునీటి ప్రాజెక్టులు పూర్తికాలేదని ఆరోపించారు.గతంలో చేపట్టిన మక్తల్–నారాయణపేట ప్రాజెక్టును కేసీఆర్ ప్రభుత్వం పక్కన పెట్టిందని విమర్శించారు. తమ ప్రభుత్వం ఆ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తుంటే అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. కొడంగల్ ప్రాంత అభివృద్ధికి తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నదని రేవంత్‌రెడ్డి విమర్శించారు. ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన నిధులను వినియోగించినప్పటికీ, ఉద్యోగులకు జీతాలు ఇచ్చేందుకు కూడా ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు, వాటిపై వడ్డీల భారం తమ ప్రభుత్వంపై ఉందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 జనవరి 1వ తేదీ నుంచి ప్రతి నెలా ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన నిధులను ప్రతి నెలా పదో తేదీలోపు విడుదల చేస్తున్నామని ప్రభుత్వ పనులు చేసిన కాంట్రాక్టర్లకు 20వ తేదీలోపు బిల్లులు చెల్లిస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వ అప్పులకు సంబంధించి ఏటా సుమారు రూ.80 వేల కోట్ల భారం పడుతోందని ఇప్పటివరకు రూ.2 లక్షల కోట్లకు పైగా వడ్డీ చెల్లించామని ఆయన పేర్కొన్నారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఉద్దేశించి రేవంత్‌రెడ్డి వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ గడ్డం పెంచుకున్నంత మాత్రాన నాయకుడు కాలేరని గడ్డం రావడానికి 50 ఏళ్లు పట్టిందని, బుద్ధి రావడానికి ఎన్ని సంవత్సరాలు పడుతుందో తెలియదని ఎద్దేవా చేశారు. పది జన్మలు ఎత్తినా తనలా కాలేరంటూ వ్యాఖ్యానించారు. జర్నలిస్టుల సమస్యలపైనా సీఎం రేవంత్ స్పందించారు. గతంలో జర్నలిస్టులకు ఇచ్చిన ఇళ్ల పట్టాలను సుప్రీంకోర్టు రద్దు చేసిన విషయాన్ని ప్రస్తావించారు. ఆ సమస్యకు పరిష్కారం చూపించి అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని మీడియా మిత్రుల సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు.కొడంగల్ నియోజకవర్గంలో సీఎం పర్యటన సందర్భంగా సుమారు రూ.9,053 కోట్ల విలువైన 13 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపట్టారు. ఇందులో రూ.5,060 కోట్లతో నిర్మించనున్న రేడియల్ రోడ్–2, రూ.2,100 కోట్లతో చేపట్టనున్న మక్తల్–నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం రెండో దశ, రూ.1,410 కోట్లతో 223 బీటీ రోడ్ల పనులు ప్రధానమైనవి. లగచర్ల పారిశ్రామిక కారిడార్‌లో రూ.81 కోట్లతో ఎకో పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలోని రైతులు, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడమే ‘ప్రజాబలం’ కార్యక్రమం ఉద్దేశమని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. సంక్రాంతి తర్వాత గ్రామాల్లో పర్యటించి ప్రజల నుంచి సమస్యలను తెలుసుకుంటానని, కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఐదు రాష్ట్రాల ఎన్నికలకు ఈసీ సిద్ధం

కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తో పాటు మరో ఇద్దరు కమిషనర్లు వివేక్ జోషి, సుఖ్ బీర్ సింగ్ సంధూ పర్యటించనున్నారు. ఐదు రాష్ట్రాల్లో వీరు పర్యటించి స్థానిక పరిస్థితుల్ని తెలుసుకున్న తర్వాత ఆయా చోట్ల ఎన్నికల షెడ్యూల్ విడుదలపై ఓ అంచనాకు వస్తారు. అనంతరం కేంద్ర ఎన్నికల కమిషన్ భేటీ అయి ఎన్నికల తేదీల్ని, ఇతర అంశాల్ని నిర్ణయించనుంది. ఈ లెక్కన జనవరి రెండో వారంలో ఐదు రాష్ట్రాల ఎన్నికల ప్రకటన రావచ్చని అంచనా వేస్తున్నారు.ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల కమిషనర్ల పర్యటనకు ముందే అక్కడ డిప్యూటీ ఎన్నికల కమిషనర్లు పర్యటించబోతున్నారు. వారి పర్యటనలు ముగిశాక కమిషనర్లు పర్యటించి పూర్తి సమాచారం సేకరిస్తారు. ఎన్నికల నిర్వహణకు తగిన పరిస్థితులు ఉన్నాయో లేదో అధికారులతో చర్చించి వివరాలు తీసుకుంటారు. వీటి ఆధారంగా తుది షెడ్యూల్ ఖరారవుతుంది. మరోవైపు ఎన్నికలు జరగాల్సిన ఐదు రాష్ట్రాల్లో యూపీ, ఉత్తరాఖండ్, గోవాలో ఎన్డీయే ప్రభుత్వాలే ఉన్నాయి. మణిపూర్ లో సంకీర్ణ ప్రభుత్వం, పంజాబ్ లో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉంది. తాజాగా ఈసీ, ఎస్ఐఆర్ వివాదాలు, జ్ఞానేష్ కుమార్ రాజీనామా డిమాండ్ల తర్వాత జరగబోయే ఈ ఎన్నికలు అధికార ఎన్డీయే, విపక్ష ఇండియా కూటమికి కీలకంగా మారాయి.

శాంతి పునరుద్ధరణే భారత్ ధ్యేయం

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) రష్యా–ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధ సంక్షోభాన్ని కేవలం చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే పరిష్కరించుకోవాలని భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ సోమవారం సాయంత్రం ప్రధాని మోదీతో టెలిఫోన్‌లో మాట్లాడారు. ఈ సంభాషణకు సంబంధించిన వివరాలను భారత ప్రధానమంత్రి కార్యాలయం అధికారికంగా విడుదల చేసింది. పీఎంఓ ప్రకటన ప్రకారం రష్యాతో నెలకొన్న ప్రస్తుత యుద్ధ పరిణామాలపై తన అభిప్రాయాలను అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రధాని మోదీతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, సమస్యల పరిష్కారంలో భారత్ ఎల్లప్పుడూ అనుసరించే ‘మానవతా దృక్పథాన్ని’ పునరుద్ఘాటించారు. వివాదాలను కేవలం చర్చలు, దౌత్యం ద్వారానే పరిష్కరించుకోవాలనేది భారత్ యొక్క స్థిరమైన విధానమని స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో శాంతిని పునరుద్ధరించేందుకు ఉద్దేశించిన అన్ని రకాల ప్రయత్నాలకు తమ వంతు సహకారం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని ప్రధాని తెలిపారు. అలాగే, ఇరు దేశాల ప్రజల ప్రయోజనాల దృష్ట్యా వివిధ రంగాలలో భారత్–ఉక్రెయిన్ ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవడంపై కూడా నేతలిద్దరూ చర్చించారు.మరోవైపు, ఈ ఫోన్ సంభాషణపై ఉక్రెయిన్ అధ్యక్ష కార్యాలయం కూడా ఒక ప్రకటన విడుదల చేసింది. యుద్ధాన్ని ముగింపు దశకు తీసుకువచ్చేందుకు అవసరమైన దౌత్య ప్రక్రియలు, తదుపరి చర్యలపై ప్రధాని మోదీతో చర్చించినట్లు పేర్కొంది. రాబోయే అబూదాబీ సమావేశ ఎజెండా కోసం ఉక్రెయిన్ సిద్ధమవుతోందని జెలెన్‌స్కీ తెలిపారు. ఉక్రెయిన్ ఎల్లప్పుడూ నిర్మాణాత్మక వైఖరితోనే ఉందని, రష్యా నుంచి కూడా యుద్ధ ఉద్రిక్తతలను తగ్గించే విధంగా అలాంటి చొరవే అవసరమని ఆయన పేర్కొన్నారు. “ఇది యుద్ధాన్ని కొనసాగించాల్సిన సమయం కాదు ముగించాల్సిన సమయం అని రష్యా నాయకత్వంతో సహా అందరికీ ప్రధాని మోదీ గతంలో పలుమార్లు స్పష్టంగా చెప్పారు. ఈ నేపథ్యంలో యుద్ధానికి ముగింపు పలికేలా భారత్ తన వంతుగా ఎలాంటి చర్యలు తీసుకోగలదో గుర్తించడం, ఇతర దేశాల నాయకులతో సంప్రదింపులు జరపడం ఎంతో కీలకం” అని జెలెన్‌స్కీ వ్యాఖ్యానించారు. నల్ల సముద్రంలో నిలిచిపోయిన ధాన్యపు ఎగుమతులు, ఆహార భద్రత అంశంపై కూడా ఇరువురు నేతలు చర్చించారు.

ఆహార రవాణా కారిడార్ల పునరుద్ధరణలో మధ్యవర్తిత్వం వహించేందుకు భారత్ సిద్ధంగా ఉందని, ఈ విషయంలో భారత్ చేసే ప్రయత్నాల కోసం తాము ఎదురుచూస్తున్నామని ఉక్రెయిన్ తెలిపింది. సముద్ర మార్గాలను అడ్డుకోవడం వల్ల రష్యా ఆర్థిక వ్యవస్థతో పాటు వివిధ దేశాల్లోని కోట్లాది మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జెలెన్‌స్కీ ఆవేదన వ్యక్తం చేశారు.ఇటీవల అట్లాంటాలో జరిగిన జీ20 విదేశాంగ మంత్రుల సదస్సు సందర్భంగా భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ మాట్లాడుతూ, ఈ సంక్షోభ పరిష్కారం కోసం భారత్ నిరంతరం ప్రయత్నిస్తోందని వెల్లడించారు. పౌర నౌకలు మరియు నావికులపై దాడులు జరగకుండా చూడటం, నల్ల సముద్రం ద్వారా ధాన్యపు ఎగుమతులను పునరుద్ధరించడం, అలాగే ఇంధన మౌలిక వసతులపై దాడులు జరగకుండా చూడటం అనే మూడు ప్రధాన అంశాలపై భారత్ రష్యా, ఉక్రెయిన్ మరియు యూరప్ దేశాలతో చర్చిస్తోందని తెలిపారు.

జిల్లాల్లోనే సమగ్ర వైద్యం

అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.రాష్ట్రవ్యాప్తంగా 1,616 మంది స్పెషలిస్ట్ వైద్యులను నియమించినట్లు మంత్రి తెలిపారు. అవసరమైన నర్సులు, టెక్నీషియన్ల నియామకాలు కూడా చేపట్టినట్లు వివరించారు.30 పడకలు, 50 పడకలు, 100 పడకల ఆసుపత్రులకు వేర్వేరు వైద్య సేవల ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ప్రతి ఆసుపత్రిలో స్పెషలిస్ట్ వైద్య సేవలు, ఆధునిక పరికరాలు, డయాగ్నస్టిక్ సదుపాయాలు కల్పించాలని మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. ఐపీహెచ్ఎస్ ప్రమాణాలకు అనుగుణంగా ఆసుపత్రులను అభివృద్ధి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ఆసుపత్రుల పనితీరు, వైద్య సేవల నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ అవసరమని చెప్పారు.


గత కొన్నేళ్లలో ఆరోగ్యశాఖలో వేలాది ఉద్యోగాలు భర్తీ చేయడం, కొత్త ఆసుపత్రి భవనాల నిర్మాణం, పరికరాల సమకూర్పు ద్వారా సెకండరీ హెల్త్ కేర్ వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు ఆయన వివరించారు. ప్రజలు తమ జిల్లాల్లోనే నాణ్యమైన వైద్య సేవలు పొందాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. దీని వల్ల రోగులు దూర ప్రాంతాలకు ప్రయాణించాల్సిన అవసరం తగ్గుతుంది. సమయం, డబ్బు ఆదా అవుతాయి.అధికారులు ఈ దిశగా వేగంగా చర్యలు తీసుకోవాలని మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు.తెలంగాణలో గ్రామీణ, జిల్లా స్థాయి ఆరోగ్య వ్యవస్థను మెరుగుపరచడం ద్వారా ప్రజల ఆరోగ్య భద్రత పెరుగుతుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి. స్పెషలిస్ట్ వైద్యులు, ఆధునిక పరికరాలు అందుబాటులోకి రావడంతో జిల్లా ఆసుపత్రులు పూర్తి స్థాయి వైద్య కేంద్రాలుగా మారనున్నాయి.

అనుమతులు ఓక చోట నిర్మాణాలు మరోచోట

అధికారుల అండతో అక్రమ ఎన్ఓసీల జారీ.?



శ్రీ వరాహ కన్స్ట్రక్షన్స్ - హరి రామ్ చౌదరి



మహాలక్ష్మి కన్స్ట్రక్షన్స్ - సిద్దేశ్వర్



సాయి కృప వెంచర్స్ – డా.సవిత, కాచం రాజేశ్వర్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కోర్టు తీర్పులు ఒకవైపు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న వ్యవహారాలు మరోవైపు చట్టపరమైన వివాదాలు కొనసాగుతున్న భూములపై నిబంధనలను పక్కనపెట్టి అక్రమంగా ఎన్ఓసీలు జారీ చేశారనే ఆరోపణలు సికింద్రాబాద్ జోన్ పరిధిలో కలకలం రేపుతున్నాయి. జీహెచ్ఎంసీ నిబంధనలకు తూట్లు పొడుస్తూ, భూ వివాదాలను పట్టించుకోకుండా అధికారులు నిర్మాణాలకు మార్గం సుగమం చేస్తున్నారా.? అధికారుల నిర్లక్ష్యమా.? లేక తెరవెనుక డబ్బుల వ్యవహారం నడుస్తోందా.? అన్న ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. మారేడ్‌పల్లిలో కోట్లాది రూపాయల విలువైన భూముల చుట్టూ నకిలీ పత్రాలు, అక్రమ కట్టడాలు, వివాదాస్పద రిజిస్ట్రేషన్లు, నిర్మాణ అనుమతుల వ్యవహారం ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఈ వ్యవహారంలో జీహెచ్ఎంసీ అధికారుల పాత్రపైనా బాధిత కుటుంబ సభ్యులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు.

హైకోర్టు తీర్పు స్పష్టంగా ఉన్న, వివాదం ఎందుకు.?

మారేడుపల్లి మండలం సర్వే నంబర్ 74/10లోని 39 ఎకరాల 31 గుంటల పట్టా భూమికి సంబంధించి సుదీర్ఘకాలంగా న్యాయపోరాటం కొనసాగింది. గతంలో మారేడుపల్లి ఎమ్మార్వో ఈ భూమిని ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ వివాదం లేవనెత్తడంతో ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ చట్టం కింద ప్రత్యేక న్యాయస్థానంలో ఎల్బీసీ నంబర్ 167/1997 కేసు విచారణకు వచ్చింది. 2010లో ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పులో సర్వే నంబర్ 74/10లోని 39 ఎకరాల 31 గుంటల భూమి దిల్దార్ అలీ ఖాన్ పేరుపై ఉన్న పట్టా భూమిగా పేర్కొంది. ఈ తీర్పును సవాలు చేస్తూ ప్రభుత్వం రిట్ పిటిషన్ నంబర్ 19106/2010 దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు డివిజన్ బెంచ్ 2025 మే 28న తుది తీర్పు వెలువరించింది. సర్వే నంబర్ 74/1లోని మూడు ఎకరాల ఒక గుంట మాత్రమే ప్రభుత్వ భూమిగా నిర్ధారించగా, 74/2 నుంచి 74/13 వరకు మిగిలిన భూమిని పట్టా భూమిగా ధృవీకరించింది. సర్వే నంబర్ 74/10లోని 39 ఎకరాల 31 గుంటల భూమిపై దిల్దార్ అలీ ఖాన్ వారసుల హక్కును స్పష్టం చేసింది.

తీర్పు తర్వాత కూడా నకిలీ పత్రాల వ్యవహారమా.?

న్యాయస్థానం తీర్పుతో భూమి యాజమాన్యంపై స్పష్టత వచ్చినప్పటికీ, కొందరు వ్యక్తులు నకిలీ పత్రాలు సృష్టించి భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని అసలు వారసులు ఆరోపిస్తున్నారు. మరనూరి ఆళ్వార్స్ స్వామి నుంచి ఒక ఎకరం 23 గుంటల భూమిని కొనుగోలు చేసినట్లు డాక్యుమెంట్ నంబర్ 720/2020తో బోగస్ పత్రాలు సృష్టించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అదే భూమిని మరనూరి శ్రీకాంత్ ద్వారా హరినామ ప్రచార సమితికి లీజుకు ఇచ్చి గోశాల నిర్వహిస్తున్నట్లు బాధితులు పేర్కొన్నారు. అసలు యాజమాన్య హక్కులు, పత్రాల ప్రామాణికతపై సంబంధిత శాఖలు సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు.

రికార్డుల్లో లేని విభజన, తొమ్మిది ఎకరాలపై కొత్త వివాదం

రెవెన్యూ రికార్డుల్లో ఎలాంటి పార్టిషన్ డీడ్ లేకపోయినా, తొమ్మిది ఎకరాల 20 గుంటల భూమిని భాగాలుగా విభజించినట్లు పత్రాలు సృష్టించారనే ఆరోపణలు మరో సంచలనంగా మారాయి. ఈ వ్యవహారంపై స్థానిక తహసీల్దార్ డబ్ల్యూపీ నంబర్ 9707/2020లో హైకోర్టుకు సమర్పించిన కౌంటర్‌లో సంబంధిత పత్రాలను ఫోర్జరీ, నమోదు కాని పత్రాలుగా పేర్కొన్నట్లు బాధితులు వెల్లడిస్తున్నారు. ఇంతటి తీవ్రమైన వివాదం ఉన్న భూముల విషయంలో అధికారులు అన్ని రికార్డులను పరిశీలించారా.? న్యాయస్థానాల్లో ఉన్న కేసుల వివరాలను పరిగణనలోకి తీసుకున్నారా.? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

లింక్ పత్రాలు లేక అనుమతి నిరాకరణ, మరి ఎన్ఓసీలు ఎలా.?

మహాలక్ష్మి నిర్మాణ సంస్థ సమర్పించిన పత్రాలను పరిశీలించిన సమయంలో లింక్ డాక్యుమెంట్లు లేవనే కారణంతో అనుమతి దరఖాస్తును తిరస్కరించినట్లు సమాచారం. అయితే ఇదే భూముల వ్యవహారంలో ఎన్ఓసి పత్రాలు ఎలా జారీ అయ్యాయి.? వాటికి ఆధారాలేమిటి.? కోర్టు వివాదాల వివరాలు అధికారుల దృష్టికి వచ్చాయా.? అన్న అంశాలపై అధికారులు వివరణ ఇవ్వాల్సి ఉంది.ఒకవైపు పత్రాల లోపాలతో అనుమతులు నిరాకరించినట్లు సమాచారం ఉండగా, మరోవైపు నిర్మాణాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు రావడం అధికారుల పనితీరుపై అనుమానాలకు తావిస్తోంది.

డెవలప్‌మెంట్ ఒప్పందాలు, ఫ్లాట్ల విక్రయాలపై ఆందోళన

డి. జగన్మోహన్ రెడ్డి, వి.వి. ప్రసాద్ రాజు తదితరుల నుంచి భూమిని కొనుగోలు చేసినట్లు మరో వాల్యుయేషన్ పత్రం నంబర్ 474/ఈ–ఐఎంపి/2015 సృష్టించి తొమ్మిది ఎకరాల 20 గుంటలను ఆక్రమించారనేది బాధిత కుటుంబం ఆరోపణలు చేస్తున్నాయి. ఈ భూమిపై అభివృద్ధి ఒప్పందాలు చేసుకుని మహాలక్ష్మి కన్స్ట్రక్షన్స్ ద్వారా బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తూ ఫ్లాట్లను విక్రయిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. భూమి యాజమాన్యంపై వివాదం పరిష్కారం కాకముందే నిర్మాణాలు, విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు కొనుగోలుదారుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి.

అధికారుల మౌనం వెనుక మర్మమేమిటి.?

సికింద్రాబాద్ జోన్ పరిధిలోని పలు నర్సింగ్‌లలో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వస్తున్నప్పటికీ, మారేడుపల్లి భూముల వ్యవహారం ప్రత్యేక చర్చకు దారితీస్తోంది. కోర్టు వివాదాలు ఉన్న భూములకు సంబంధించి ఎన్ఓసీలు జారీ చేయడంలో ఎవరి పాత్ర ఎంత.? పూర్తి పత్రాలను పరిశీలించకుండా అనుమతులు ఇచ్చారా.? నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన అధికారులపై ఉన్నతాధికారులు విజిలెన్స్, ఏసీబీ విచారణ జరిపిస్తారా.? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ముడుపుల ఆరోపణలు కూడా వినిపిస్తున్న నేపథ్యంలో జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు ఏసీబీ విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.

అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలి: బాధితులు

నకిలీ పత్రాల సృష్టి, భూ ఆక్రమణలు, మోసపూరిత లావాదేవీలకు పాల్పడ్డారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎం. శ్రీకాంత్, డి. జగన్మోహన్ రెడ్డి, వి.వి. ప్రసాద్ రాజు తదితరుల వ్యవహారంపై చట్టప్రకారం ప్రత్యేక విచారణ జరపాలని దిల్దార్ అలీ ఖాన్ కుటుంబ సభ్యులు ప్రభుత్వాన్ని, పోలీసు శాఖను కోరుతున్నారు.2024 జూలై 1 నుంచి అమల్లోకి వచ్చిన భారతీయ న్యాయ సంహిత ప్రకారం ఫోర్జరీ, మోసం, అక్రమ భూ ఆక్రమణలకు సంబంధించి వర్తించే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. వివాదాస్పద భూముల్లో జరుగుతున్న నిర్మాణాలపై విచారణ పూర్తయ్యే వరకు చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఫ్లాట్లు కొనేవారూ.. అప్రమత్తంగా ఉండండి

మారేడుపల్లిలో మహాలక్ష్మి నిర్మాణ సంస్థ చేపడుతున్న నిర్మాణాల్లో ఫ్లాట్లు కొనుగోలు చేసే ముందు భూమి యాజమాన్య పత్రాలు, లింక్ డాక్యుమెంట్లు, న్యాయస్థానాల ఉత్తర్వులు, నిర్మాణ అనుమతులు, ఎన్ ఓ సి పత్రాల చట్టబద్ధతను న్యాయ నిపుణులతో పరిశీలించుకోవాలని బాధిత కుటుంబం విజ్ఞప్తి చేస్తోంది. ఇప్పటికే ఫ్లాట్లు కొనుగోలు చేసినవారు కూడా తమ రిజిస్ట్రేషన్లు, కొనుగోలు పత్రాల చట్టబద్ధతను నిర్ధారించుకోవాలని సూచిస్తున్నారు.

కలెక్టర్‌కు 6 నెలల జైలుశిక్ష

జాబితాలో ఉన్న కొన్ని భూములను తొలగించాలన్న వినతిని పరిశీలించడంలో కలెక్టర్ నిర్లక్ష్యం వహించడమే ఈ కేసుకు ప్రధాన కారణం. గతంలో తీసుకున్న నిర్ణయాల ఆధారంగా తమ భూములకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని బాధితులు కోరుతున్నారు. అయితే అదే ప్రాంతంలోని కొన్ని పక్క ప్లాట్లను నిషేధిత జాబితా నుంచి తొలగించినప్పటికీ తమ భూముల విషయంలో మాత్రం అధికారులు చర్యలు తీసుకోవడం లేదని వారు కోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారంపై బాధితులు దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు 2025 ఆగస్టులో కీలక ఆదేశాలు జారీ చేసింది. బాధితులు సమర్పించిన వినతిని పరిశీలించి 60 రోజుల్లో తగిన నిర్ణయం తీసుకోవాలని అప్పటి రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. అయితే గడువు ముగిసినా రంగారెడ్డి కలెక్టర్ నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో బాధితులు గతేడాది అక్టోబర్ 15వ తేదీన కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ దాఖలైన తర్వాతే అధికారులు కదిలారు. బాధితులకు నోటీసులు జారీ చేసి.. ఈ ఏడాది ఫిబ్రవరి 26వ తేదీన వారి వినతిని తిరస్కరిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అనంతరం కోర్టు మరోసారి పునఃపరిశీలించాలని ఆదేశించినప్పటికీ.. ఈ ఏడాది జులై 8వ తేదీన మరోసారి తిరస్కరణ ఉత్తర్వులు జారీ చేశారు. కోర్టు ఆదేశాలను అమలు చేయాల్సిన సమయంలో స్పందించకుండా.. ధిక్కరణ పిటిషన్ దాఖలైన తర్వాత మాత్రమే ప్రక్రియ చేపట్టడాన్ని ధర్మాసనం తీవ్రంగా తప్పుబట్టింది. రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ), తహసీల్దార్ నుంచి నివేదికలు తెప్పించుకున్నామని బాధితులతో విచారణ కూడా నిర్వహించామని కలెక్టర్ హైకోర్టుకు ఇచ్చిన వివరణలో పేర్కొన్నారు. అయితే కోర్టు పరిశీలించిన రికార్డుల్లో ఇందుకు సంబంధించిన వివరాలు సరిపోలలేదు. ఈ ఏడాది ఫిబ్రవరి 21వ తేదీన జరిగిన విచారణకు సంబంధించిన పత్రాల్లో ఆర్డీఓ, తహసీల్దార్, అధీకృత అధికారి సంతకాల కోసం కేటాయించిన చోట్ల ఖాళీగా ఉన్నట్లు ధర్మాసనం గుర్తించింది. అఫిడవిట్‌లో పేర్కొన్న వివరాలకు రికార్డుల్లో ఆధారాలు లేకపోవడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. కలెక్టర్ కౌంటర్ అఫిడవిట్‌లోని ఓ ప్రకటనను స్పష్టంగా తప్పుదోవ పట్టించే విధంగా ఉందని వ్యాఖ్యానించింది.ఈ కేసులో మరో కీలక అంశాన్ని కూడా హైకోర్టు ప్రస్తావించింది. వివాదంలో ఉన్న నాలుగు సర్వే నంబర్లలో 537ను నిషేధిత ఆస్తుల జాబితా నుంచి తొలగించగా.. 536, 657, 658 నంబర్ల భూములను మాత్రం అదే జాబితాలో కొనసాగించారు. ఒక సర్వే నంబర్‌తో పాటు మరికొన్ని భూములను తొలగించి, బాధితుల భూములకు మాత్రం ఎందుకు మినహాయింపు ఇవ్వలేదని ధర్మాసనం ప్రశ్నించింది. 2004 జనవరి 5వ తేదీన భూ సంస్కరణల ట్రిబ్యునల్ ఇచ్చిన ఉత్తర్వులను కూడా ఈ సందర్భంగా పరిగణనలోకి తీసుకుంది. భూ సంస్కరణల చట్టం కింద భూములను తిరిగి అప్పగించే ప్రక్రియ పూర్తికాలేదని అందువల్ల సెక్షన్ 22ఏ జాబితా నుంచి వాటిని తొలగించడం సాధ్యం కాదని కలెక్టర్ తరఫున వాదించారు. అయితే గతంలో న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాల చట్టబద్ధతను కోర్టు ధిక్కరణ విచారణలో మళ్లీ ప్రశ్నించలేరని హైకోర్టు స్పష్టం చేసింది. ఆదేశాలు సరైనవా కాదా అనే అంశంతో సంబంధం లేకుండా వాటిని అమలు చేయాల్సిందేనని పేర్కొంది.అంతేకాకుండా 2004లో భూ సంస్కరణల ట్రిబ్యునల్ ఇచ్చిన ఉత్తర్వులపై రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌ను ఈ ఏడాది ఏప్రిల్ 25వ తేదీని కాలపరిమితి కారణంగా కొట్టివేసిన విషయాన్ని కూడా ధర్మాసనం ప్రస్తావించింది. కోర్టు ఆదేశాల గురించి కలెక్టర్‌కు పూర్తిగా తెలిసినప్పటికీ వాటిని అమలు చేయడానికి తగిన అవకాశం ఉన్నా ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేశారని నిర్ధారించింది. ఈ నేపథ్యంలోనే 6 నెలల సాధారణ జైలు శిక్ష, రూ.2,000 జరిమానా విధించింది. అప్పీల్ దాఖలు చేసుకునేందుకు నాలుగు వారాల పాటు శిక్ష అమలును నిలిపివేసింది. హైకోర్టు ఇచ్చిన తీర్పుపై కలెక్టర్ నాలుగు వారాల గడువులో అప్పీల్ దాఖలు చేస్తారా ఉన్నత న్యాయస్థానం నుంచి శిక్షపై మరింత ఉపశమనం లభిస్తుందా నిషేధిత ఆస్తుల జాబితాలో ఉన్న వివాదాస్పద భూముల విషయంలో అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ప్రభుత్వ అధికారులైనా న్యాయస్థానం ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలనే అంశాన్ని ఈ తీర్పు మరోసారి స్పష్టం చేసింది.

ప్రజా తీర్పుతో కూటమికి కొండంత బలం

100 పట్టణ స్థానిక సంస్థల్లో 95 చోట్ల కౌన్సిల్ మెజారిటీ సాధించగా, 16 పట్టణ స్థానిక సంస్థల్లో అన్ని వార్డులనూ కూటమి గెలుచుకోవడం విశేషం.మరోవైపు వైసీపీ కేవలం నాలుగు పట్టణ స్థానిక సంస్థలకే పరిమితమైంది. 3,941 వార్డుల్లో 558 స్థానాలే దక్కించుకుంది. 22 పట్టణ స్థానిక సంస్థల్లో ఒక్క వార్డు కూడా గెలుచుకోలేకపోయింది. పట్టణాల్లో కూటమికి 59.9 శాతం ఓట్లు రాగా, వైసీపీకి 34.3 శాతం మాత్రమే వచ్చాయి. కూటమి స్ట్రైక్ రేట్ 94 శాతంగా నమోదైంది.

27 జిల్లాల్లో కూటమి హవా

గ్రామీణ ప్రాంతాల్లోనూ కూటమి ఆధిపత్యం కొనసాగింది. మొత్తం 659 జెడ్పీటీసీ స్థానాలకు గాను 575 స్థానాలను గెలుచుకుంది. రాష్ట్రంలోని 28 జిల్లాల్లో 27 జిల్లాల్లో కూటమి ఆధిక్యత సాధించింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో మాత్రమే వైసీపీ కూటమి కంటే ఎక్కువ స్థానాలు సాధించింది. ఏడు జిల్లాల్లో వైసీపీకి ఒక్క జెడ్పీటీసీ స్థానం కూడా దక్కలేదు. అనకాపల్లి, కోనసీమ, కాకినాడ, మార్కాపురం, పల్నాడు, పశ్చిమగోదావరి, విశాఖ జిల్లాల్లో వైసీపీ ఖాతా తెరవలేకపోయిందని సీఎం వెల్లడించారు. ఎంపీటీసీ ఎన్నికల్లో మొత్తం 9,818 స్థానాలకు గాను కూటమి 7,803 స్థానాలను కైవసం చేసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 90 శాతం మండల అధ్యక్ష స్థానాలు కూటమికే దక్కే అవకాశముందని వివరించారు. జెడ్పీటీసీ ఎన్నికల్లో కూటమికి 57.6 శాతం, వైసీపీకి 39.7 శాతం ఓట్లు వచ్చాయని తెలిపారు. పట్టణాల్లో 25.6 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 17.9 శాతం మేర కూటమికి, వైసీపీకి మధ్య ఓట్ల వ్యత్యాసం ఉందన్నారు.

పులివెందులలోనూ మారిన రాజకీయ సమీకరణాలు

వైసీపీకి కంచుకోటగా భావించే పులివెందులలోనూ కూటమి సత్తా చాటిందని చంద్రబాబు పేర్కొన్నారు. అక్కడ 13,875 ఓట్ల మెజారిటీతో చైర్‌పర్సన్ పదవిని కూటమి దక్కించుకుందని, మొత్తం 40 వార్డుల్లో 37 స్థానాలను గెలుచుకుందని చెప్పారు. కడప కార్పొరేషన్‌లో 65,588 ఓట్ల మెజారిటీతో విజయం సాధించడంతో పాటు 66 వార్డుల్లో 64 స్థానాలను కైవసం చేసుకుందని వివరించారు. కడప జిల్లాలోని తొమ్మిది పట్టణ స్థానిక సంస్థలూ కూటమి ఖాతాలోకి వచ్చాయని, 345 వార్డులకు గాను వైసీపీ కేవలం తొమ్మిది స్థానాలకే పరిమితమైందని తెలిపారు.
విశాఖలో 2,47,817 ఓట్లు, విజయవాడలో 1,30,872 ఓట్లు, గుంటూరులో 96,294 ఓట్ల ఆధిక్యంతో కూటమి విజయం సాధించిందని చెప్పారు. మార్కాపురం జిల్లాలో 21కి 21 జెడ్పీటీసీలు, అనకాపల్లి జిల్లాలో 24కి 24 జెడ్పీటీసీలు కూటమి గెలుచుకోవడం ప్రజల మద్దతుకు నిదర్శనమన్నారు.

మహిళలకు 60 శాతం.. సామాజిక న్యాయానికి పెద్దపీట

స్థానిక సంస్థల ఎన్నికల్లో కేవలం గెలుపుపైనే కాకుండా సామాజిక ప్రాతినిధ్యంపైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టామని ముఖ్యమంత్రి తెలిపారు. తెలుగుదేశం నుంచి గెలిచిన 70 మంది మేయర్లు, చైర్‌పర్సన్లలో 42 మంది మహిళలేనని, అంటే 60 శాతం ప్రాతినిధ్యం కల్పించామని వెల్లడించారు. పది మేయర్ పదవుల్లో ఎనిమిది పదవులు మహిళలకు దక్కాయని చెప్పారు.విశాఖ, విజయనగరం, మచిలీపట్నం, గుంటూరు, ఒంగోలు, కడప, కర్నూలు, చిత్తూరు నగరాలకు మహిళలు మేయర్లుగా నాయకత్వం వహించనున్నారని వివరించారు. అలాగే టీడీపీ నుంచి ఎన్నికైన 70 మంది మేయర్లు, చైర్‌పర్సన్లలో 44 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందినవారని తెలిపారు. మొత్తంగా ఈ వర్గాలకు 62.9 శాతం ప్రాతినిధ్యం లభించిందన్నారు. బీసీలకు 25, ఎస్సీలకు తొమ్మిది, మైనారిటీలకు తొమ్మిది, ఎస్టీలకు ఒక పదవి దక్కిందని చెప్పారు. మొత్తం 27 సామాజిక వర్గాలకు చెందినవారు టీడీపీ తరఫున మేయర్లు, చైర్‌పర్సన్లుగా ఎన్నిక కావడం సామాజిక న్యాయానికి నిదర్శనమని పేర్కొన్నారు. పది మంది టీడీపీ మేయర్లు పది విభిన్న సామాజిక వర్గాలకు చెందినవారని, తొమ్మిది మంది ముస్లిం మైనారిటీలు చైర్‌పర్సన్లు, మేయర్లుగా ఎన్నిక కాగా, వారిలో ఆరుగురు మహిళలేనని వెల్లడించారు.

యువతకు పట్టం.. విద్యావంతులకు అవకాశం

రాజకీయాల్లో యువతకు, విద్యావంతులకు అవకాశాలు కల్పించడంలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టామని చంద్రబాబు చెప్పారు. టీడీపీ నుంచి ఎన్నికైన 70 మంది మేయర్లు, చైర్‌పర్సన్లలో 55 మంది డిగ్రీ లేదా అంతకంటే ఎక్కువ విద్యార్హతలు కలిగినవారని, 11 మంది పీజీ చదివినవారని వివరించారు. 31 మంది 45 ఏళ్లలోపు వారని, ఎనిమిది మంది 35 ఏళ్లలోపు వారని తెలిపారు. పది మంది మేయర్ల సగటు వయసు 39 సంవత్సరాలని పేర్కొన్నారు.
రాజంపేటలో 26 ఏళ్ల డాక్టర్ దొంతం గాయత్రి, మచిలీపట్నంలో 29 ఏళ్ల షేక్ అబ్దుల్ అబీదా, విజయనగరంలో 31 ఏళ్ల అవనాపు భార్గవి, విశాఖలో 32 ఏళ్ల డాక్టర్ ముక్కా శ్రావణి మేయర్లుగా ఎన్నిక కావడం యువతకు ఇచ్చిన ప్రాధాన్యానికి నిదర్శనమన్నారు. ఒంగోలులో 24 ఏళ్ల చావలి చార్వీత కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారని గుర్తు చేశారు. రాజకీయ నేపథ్యం లేని సామాన్యులు, నిరుపేదలు, రోజువారీ కూలీలు, ఉన్నత విద్యావంతులు ఇలా అన్ని వర్గాల వారికి నాయకత్వ అవకాశాలు కల్పించామని తెలిపారు. మరో 30 ఏళ్లకు సరిపోయేలా కొత్త నాయకత్వాన్ని తయారు చేశామని ధీమా వ్యక్తం చేశారు.

రెండున్నరేళ్ల పాలనకు ప్రజామోదం

గత ప్రభుత్వ పాలనలో జరిగిన విధ్వంసాన్ని ప్రజలకు వివరించేందుకు ఏడు శ్వేతపత్రాలు విడుదల చేశామని చంద్రబాబు చెప్పారు. రాష్ట్ర పునర్నిర్మాణానికి స్వర్ణాంధ్ర విజన్ రూపొందించి, పేదరిక నిర్మూలన నుంచి డీప్‌టెక్ వరకు కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు ఎస్ఐపీబీ, కేబినెట్ సమావేశాల ద్వారా వేగంగా అనుమతులు ఇస్తున్నామని, వివిధ శాఖల పనితీరుపై ప్రగతి నివేదికలు అందించామని పేర్కొన్నారు.రాయలసీమలో కరవుకు శాశ్వత పరిష్కారం నీళ్లేనని, సాగునీటి ప్రాజెక్టుల ద్వారా రైతులకు భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. 36 ప్రాజెక్టులను సుమారు రూ.35 వేల కోట్లతో పూర్తి చేసే కార్యాచరణ చేపట్టామని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టు తొలిదశను ప్రారంభించి నీరందించామని, పోలవరం ఎడమ కాల్వ ద్వారా గోదావరి జలాలను అనకాపల్లికి తీసుకెళ్లామని గుర్తు చేశారు. రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటించారు.సూపర్ ఎల్‌నినో వంటి తీవ్ర వాతావరణ పరిస్థితులు, అర్నబ్, మురసు తుపాన్లను సమర్థంగా ఎదుర్కొన్నామని తెలిపారు. రెండు తుపాన్ల వల్ల 30 వేలకుపైగా విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నప్పటికీ పునరుద్ధరణ చర్యలు చేపట్టామని, ముందస్తు హెచ్చరికలు, సాంకేతిక పరిజ్ఞానంతో ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించేందుకు కృషి చేశామని చెప్పారు. ప్రజల కష్టకాలంలో ప్రభుత్వం అండగా నిలిచిందని, ఆ సేవలను ప్రజలు గుర్తించి ఎన్నికల్లో మద్దతు పలికారని అన్నారు.

ఓటములపై సమీక్ష.. తప్పులకు ఉపేక్ష లేదు

రాష్ట్రవ్యాప్తంగా ఘన విజయం సాధించినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ఎదురైన ఓటములను తేలిగ్గా తీసుకోబోమని చంద్రబాబు స్పష్టం చేశారు. అనంతపురంలో ఓటమి ఎదురవడం ఆశ్చర్యం కలిగించిందని, ఏజెన్సీ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా ఆశించిన ఫలితాలు రాకపోవడానికి కారణాలను విశ్లేషిస్తామని చెప్పారు. అరకు కాఫీ బ్రాండ్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడంతో పాటు గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేశామని గుర్తు చేశారు. అక్కడి ఫలితాల వెనుక ఉన్న వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తామని తెలిపారు.ఎక్కడ తప్పులు దొర్లినా సరిదిద్దుకుంటామని, అవసరమైతే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. కూటమి నిర్ణయాలను ఉల్లంఘించి రెబల్‌గా పోటీ చేసిన వారిని తిరిగి పార్టీలో చేర్చుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. సీట్లు దక్కకపోయినా కూటమి ధర్మానికి కట్టుబడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలను అభినందించారు. త్యాగాలు చేసిన కేడర్‌ను గుర్తించి గౌరవిస్తామని భరోసా ఇచ్చారు.

కుప్పంలో ఓటమినీ గౌరవించాం

ప్రజాస్వామ్యంపై నమ్మకం ఉన్నవారు ప్రజాతీర్పును గౌరవించాలని చంద్రబాబు అన్నారు. కుప్పంలో ఒక ఎంపీటీసీ స్థానాన్ని కూటమి కోల్పోయినప్పటికీ దాన్ని బలవంతంగా కైవసం చేసుకునే ప్రయత్నం చేయలేదని చెప్పారు. కక్కుర్తి పడితే ఆ స్థానాన్ని కూడా తమ ఖాతాలో వేసుకునే అవకాశం ఉండేదని, కానీ ప్రజల స్వచ్ఛంద తీర్పునే గౌరవించామని పేర్కొన్నారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేస్తేనే క్షేత్రస్థాయి వాస్తవాలు తెలుస్తాయని అన్నారు. ఈవీఎంలతో ఎన్నికలు జరిగితే మేనిపులేషన్ జరిగిందని, బ్యాలెట్‌తో జరిగితే రిగ్గింగ్ జరిగిందని ఆరోపించడం వైసీపీ వైఖరిని ప్రతిబింబిస్తోందని విమర్శించారు. పట్టణాల్లో పోస్టల్ బ్యాలెట్లలో కూటమికి 65.70 శాతం, వైసీపీకి 27.42 శాతం ఓట్లు వచ్చాయని, పరిషత్ ఎన్నికల్లో కూటమికి 62.83 శాతం, వైసీపీకి 31.46 శాతం లభించాయని తెలిపారు. ఉద్యోగులు సహా వివిధ వర్గాల మద్దతు కూటమికి లభించిందని చెప్పారు.

డబ్బు కాదు.. సేవే రాజకీయాలకు పునాది

రాజకీయాల్లో డబ్బు ప్రభావం తగ్గి సేవాభావం పెరగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. టీడీపీ కేడర్ బేస్డ్ పార్టీ అని, నాయకులు పార్టీలు మారినా కార్యకర్తలు జెండా దించరని అన్నారు. మూడు పార్టీల కేడర్ సమన్వయంతో పనిచేయడం వల్లే కూటమి విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. ఎన్నికలతో తమ బాధ్యత ముగిసిపోలేదని, గెలిచిన ప్రజాప్రతినిధులపై మరింత బాధ్యత పెరిగిందని గుర్తుచేశారు. రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు తీసుకురావడమే లక్ష్యంగా ఈ నెల 12, 13 తేదీల్లో విశాఖపట్నంలో భాగస్వామ్య సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏపీ బ్రాండ్‌ను తిరిగి పటిష్టం చేసి అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తామని చెప్పారు.

స్వామి సన్నిధిలో భక్తులు అమావాస్య పూజలు

- భక్తులు కు దీపావళి శుభాకాంక్షలు - డిప్యూటీ కమిషనర్ వాణి



కౌతాళం ప్రముఖ పుణ్య క్షేత్రము అయిన ఈరన్న స్వామి సోమవారం అమావాస్య సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. కోరిన వారికి కోరికలు నెరవేర్చే కొలిచే కొంగు బంగారం ఈరన్న స్వామి. భక్తుల పాలిట కోరిన కోర్కెలు తీర్చే కల్ప వృక్షం స్వామి వారి విశేష దినోత్సవన్ని పురస్కరించుకొని ఆలయ అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారి మూల విరాట్ ను పూలు వెండి ఆభరణాలు తో అలంకరించారు. ఉదయం అరు గంటల సుప్రభాత సేవ నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు మంగళ హారతి నిర్వహించరు. ప్రత్యేక రుసుము చెల్లించి అనుమతి పొందిన భక్తుల సమక్షంలో ఎనిమిది నుంచి పది వరకు అవినేటి మండపంలో స్వామి వారికి పంచామృత అభిషేకలు సాయంత్రం ఆరు నుంచి ఎనిమిది వరకు ధ్వజ స్థంభం వద్ద ప్రకరోత్సవాలు నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి వారికి మహా నైవేద్యాన్ని సమర్పించారు. స్వామి వారి దర్శనం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలకుండా అన్ని వసతులు కల్పించామని డిప్యూటీ కమిషనర్ ఆలయ అధికారిని వాణి తెలిపారు.

రెండు చార్జిషీట్ల కోసం
రూ.2 లక్షల లంచం..!

- ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కిన కీసర ఎస్ఐ..
- పోలీస్ శాఖలో కలకలం..

మేడ్చల్ :రెండు కేసుల్లో చార్జిషీట్లు త్వరగా దాఖలు చేసేందుకు రూ.2 లక్షలు లంచం డిమాండ్ చేసిన కీసర ఎస్ఐ శ్రీనివాస్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు.భూ మోసం, 498ఏ కేసుల్లో చార్జిషీట్లు ఆలస్యం కాకుండా ఉండాలంటే డబ్బులు ఇవ్వాలని ఎస్ఐ ఒత్తిడి చేస్తున్నట్లు బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు సోమవారం కీసరలోని శిల్పా లేఅవుట్ వద్ద లంచం తీసుకుంటుండగా శ్రీనివాస్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకు న్నారు.విచారణ అనంతరం నిందితుడిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గత మూడు నెలల్లో ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, ఎస్ఐ జ్ఞానేందర్ రెడ్డి కూ డా లంచం కేసుల్లో పట్టుబడటంతో పోలీస్ శాఖలో ఈ ఘటనలు చర్చనీయాంశంగా మారాయి.

హార్వెస్టర్ లీజు పేరుతో కిడ్నాప్ డ్రామా

- రూ.10 లక్షలు డిమాండ్ చేస్తూ దాడి.. - నలుగురు నిందితుల అరెస్ట్



కామారెడ్డి హార్వెస్టర్ మిషన్లు లీజుకు ఇస్తామంటూ నమ్మించి ఓ వ్యక్తిని కిడ్నాప్ చేసిన ఘటన కామారెడ్డి జిల్లాలో కలకలం రేపింది. బాధితుడిని కిడ్నాప్ చేసిన నిందితులు రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ దాడికి పాల్పడ్డారు.జైలులో పరిచయమైన నలుగురు కలిసి ఈ నేరానికి పథకం రచించారు. నెల రోజుల పాటు నకిలీ పేరుతో ఫోన్‌లో మాట్లాడి బాధితుడిని నమ్మించారు. అనంతరం కారులో కిడ్నాప్ చేశారు. నిందితుల నుంచి తప్పించుకున్న బాధితుడిపై మరోసారి కిడ్నాప్‌కు యత్నిస్తుండగా పోలీసులు వారిని పట్టుకున్నారు.సీసీటీవీ ఫుటేజీ, సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించిన దోమకొండ పోలీసులు నలుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి కారు, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర వెల్లడించారు.

గన్నవరంలో భారీ అగ్నిప్రమాదం

- క్రాకర్స్ నిప్పురవ్వలతో దగ్ధమైన ఫర్నిచర్ షాప్

గన్నవరంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గన్నవరంలోని కాసా టీవీఎస్ షోరూం ఎదురుగా ఉన్న ఎస్ఆర్ ఫర్నిచర్ షాప్‌లో క్రాకర్స్ నిప్పురవ్వల కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.పక్కనే ఉన్న ఫోమ్ సీట్లకు మంటలు వ్యాపించడంతో అగ్నికీలలు వేగంగా విస్తరించి షాపు పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.ఈ ప్రమాదంలో సుమారు రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు.

రాజాంలో
భారీ అగ్నిప్రమాదం

- నవదుర్గ ఆటోమొబైల్ షాప్‌లో ఎగిసిపడిన మంటలు

విజయనగరం జిల్లా రాజాం పట్టణంలో భారీ అగ్నిప్రమాదం కలకలం రేపింది. పాలకొండ రోడ్డులోని నవదుర్గ ఆటోమొబైల్ షాప్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగి, దట్టమైన పొగతో పాటు భారీ అగ్నికీలలు ఎగిసిపడ్డాయి.ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సకాలంలో ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.ఈ అగ్నిప్రమాదంలో షాపు యజమాని శివకుమార్‌కు సుమారు రూ.25 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

పూసుకుపల్లిలో మోటార్ లేకుండానే బోరు

ములుగు కాళేశ్వరం సమీపంలోని పూసుకుపల్లి గ్రామ శివారులో ఆసక్తికర దృశ్యం కనిపించింది. కాళేశ్వరం సమీపంలోని పూసుకుపల్లిలో మోటార్ లేకుండానే బోరు నుంచి నీరు ఉబికి వస్తోంది. ఎలాంటి మోటార్ ఏర్పాటు చేయకుండానే ఓ బోరు నుంచి నీరు ఉబికి బయటకు వస్తోంది. మేడిగడ్డ పరిసరాల్లో నీటి లభ్యత సమృద్ధిగా ఉందనడానికి ఇదే నిదర్శనమని స్థానికులు చెబుతున్నారు.ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ ఈ ప్రాంతంలో నీరు అందుబాటులో ఉందని పేర్కొంటున్నారు. మరోవైపు, భూగర్భ జలమట్టం పెరగడం వల్లే ఈ ఒత్తిడి ఏర్పడిందా అనే చర్చ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వైరల్ అవుతోంది

హే రామ్..సేవ్ ఆంధ్రా

ఈ సందర్భంగా 'రిగ్గింగ్ మాస్టర్ చంద్రబాబు' అనే హ్యాష్‌ట్యాగ్‌ను జత చేశారు. ప్రజాస్వామ్య విలువల గురించి చంద్రబాబు మాట్లాడటాన్ని జగన్ తప్పుబట్టారు. 'రిగ్గింగ్ మాస్టర్'గా అభివర్ణించిన వ్యక్తి ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి నీతులు చెబుతుంటే ప్రజలు ఆశ్చర్యపోతున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా వ్యవహరించారంటూ చంద్రబాబుపై పరోక్షంగా ఆరోపణలు చేశారు. ఈ ట్వీట్ చివర్లో 'హే రామ్.. సేవ్ ఆంధ్రా!' అని జగన్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్నికల సందర్భంగా ఇటీవల చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'రిగ్గింగ్ మాస్టర్ చంద్రబాబు' అనే హ్యాష్‌ట్యాగ్‌తో చేసిన ఈ ట్వీట్ వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లోనూ, రాజకీయ వర్గాల్లోనూ తీవ్ర చర్చకు కారణమైంది.ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల వ్యవహారం నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య విమర్శలు కొనసాగుతున్నాయి. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ నేతలు ఆరోపణలు చేస్తుండగా రాజకీయ పరిణామాలపై కూటమి నేతల వైఖరి కూడా తీవ్ర చర్చనీయాంశంగా మారుతోంది. చంద్రబాబు, టీడీపీ నేతలు ఈ ట్వీట్‌పై ఎలా స్పందిస్తారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. సీఎం చంద్రబాబు ఆవుతోలు కప్పుకున్న తోడేలుగా మాట్లాడుతున్నారని మాజీ మంత్రి పేర్ని నాని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోలీసులు, అధికారులను అడ్డుపెట్టుకుని, విచ్చలవిడిగా డబ్బులు పంచి గెలిచారని ఆరోపించారు. చంద్రబాబుది ఉకదంపుడు ఆత్మస్తుతి తప్ప ప్రజాబలం ఎంతమాత్రం కాదని స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో టీడీపీ నేతలు, గూండాలు సాగించిన అక్రమాలకు పోలీసులు, అధికారులు బాహాటంగా సహకరించారని పేర్ని నాని ఆరోపించారు. వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా టీడీపీ శ్రేణులు, పోలీసులు అడ్డుకున్నారని కొన్నిచోట్ల నామినేషన్ పత్రాలు, బీ–ఫారాలను సైతం చించివేశారని మండిపడ్డారు. స్క్రూటినీ పేరుతో ఉద్దేశపూర్వకంగానే అనేక నామినేషన్లను తిరస్కరించారని తెలిపారు. వైసీపీ కార్యకర్తలపై రౌడీషీట్లు తెరిచి బైండోవర్లు చేసిన పోలీసులు, టీడీపీ గూండాలు, హంతకులను మాత్రం స్వేచ్ఛగా తిరగనిచ్చారని ఆరోపించారు. కడప కార్పొరేషన్ సహా పలు మున్సిపాలిటీలు, పులివెందులలో దుశ్శాసన మూకలతో దొంగ ఓట్లు వేయించుకుని గెలిచారని విమర్శించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిస్తేనే
అభివృద్ధి సాధ్యం

కలిసి ఘనంగా శంకుస్థాపన చేశారు.

- ఎన్నికల వరకే రాజకీయం - పొన్నం ప్రభాకర్

ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్, రాజకీయ విభేదాలను పక్కనబెట్టి ఉమ్మడి కరీంనగర్ జిల్లాను ఉత్తర తెలంగాణలోనే అగ్రస్థానంలో నిలబెట్టడమే తమ ప్రథమ లక్ష్యమని స్పష్టం చేశారు. “రాజకీయాలు కేవలం ఎన్నికల వరకే పరిమితం, ఆ తర్వాత ప్రజల శ్రేయస్సు, ప్రాంత అభివృద్ధే ముఖ్యం,” అని ఆయన అన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కరీంనగర్ అర్బన్ డెవలప్‌మెంట్ కోసం రూ.1,000 కోట్లు మంజూరు చేసిందని, విద్య, వైద్యం, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో పోటీపడి పనిచేస్తున్నామని తెలిపారు.
మానేరు రివర్ ఫ్రంట్ పనులపై విచారణ కొనసాగుతూనే నగర అభివృద్ధిని వేగవంతం చేస్తామని పేరొన్నారు.

డంపింగ్ యార్డ్‌పై చిల్లర రాజకీయాలు వద్దు - బండి సంజయ్

కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ, గత పాలకుల నిర్లక్ష్యం వల్ల కరీంనగర్ నగర అభివృద్ధి వెనుకబడిపోయిందని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో యూసీఎఫ్ నుంచి రూ.840 కోట్లు మంజూరు చేయించామని చెప్పారు. చాలా కాలంగా నగరవాసులను వేధిస్తున్న డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారానికి రూ.70 కోట్లు తీసుకొచ్చామని తెలిపారు. కొందరు స్వార్థ నాయకులు కమీషన్ల కోసం కాంట్రాక్టర్లను బెదిరించి పారిపోయేలా చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ, అభివృద్ధి పనుల్లో చిల్లర రాజకీయాలు చేస్తే ప్రజలే తరిమికొడతారని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదాల నివారణ, శాంతిభద్రతల
పరిరక్షణే లక్ష్యం

– విస్తృత వాహన తనిఖీలు చేపట్టిన జిల్లా పోలీసులు



ప్రకాశం ప్రజల భద్రతకు, శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రకాశం జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు, సిబ్బంది విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా ద్విచక్ర వాహనాలు, కార్లు మరియు ఇతర వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ వాహనదారుల డ్రైవింగ్ లైసెన్సులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, ఇన్సూరెన్స్, హెల్మెట్ వినియోగం తదితర అంశాలను తనిఖీ చేసారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటూ, మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ ధరించకుండా ప్రయాణించడం వంటి ప్రమాదకరమైన చర్యలకు దూరంగా ఉండాలని వాహనదారులకు అవగాహన కల్పించారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తూ నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టారు.

రాష్ట్రంలో జనవరి 25 నుంచి జనగణన

ఈ సమయంలో ప్రజలు యాప్, వెబ్‌సైట్ ద్వారా తమ కుటుంబానికి సంబంధించిన వివరాలను స్వయంగా నమోదు చేసుకోవచ్చు. ఆ తర్వాత జనవరి 25వ తేదీ నుంచి ఇంటింటి సర్వే ప్రారంభమవుతుంది. జనగణన ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్వీయ జనగణనకు అవకాశం కల్పించింది. జనవరి 10వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ప్రజలు ఆన్‌లైన్ విధానంలో తమ వివరాలను నమోదు చేసుకోవచ్చు. ఇందుకోసం ప్రత్యేకంగా అందుబాటులోకి వచ్చే యాప్, వెబ్‌సైట్‌ను వినియోగించుకోవాల్సి ఉంటుంది. ఈ విధానం ద్వారా కుటుంబ సభ్యులు తమ వివరాలను తామే నమోదు చేసుకునే వెసులుబాటు లభిస్తుంది.సెల్ఫ్ ఎన్యుమరేషన్ గడువు ముగిసిన తర్వాత జనవరి 25వ తేదీ నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు జనగణన సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జనాభా వివరాలను సేకరిస్తారు. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకున్న కుటుంబాల వివరాలను కూడా జనగణన ప్రక్రియలో భాగంగా పరిశీలించే అవకాశం ఉంటుంది. జనాభా లెక్కల సేకరణ పూర్తి అయిన తర్వాత వివరాల పరిశీలన, అవసరమైన సవరణల కోసం రివిజనల్ రౌండ్ నిర్వహించనున్నారు.
2027 మార్చి 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. జనగణనకు సంబంధించి మార్చి 1వ తేదీ అర్ధరాత్రి 12 గంటలను ప్రామాణిక తేదీగా (రెఫరెన్స్ డేట్) నిర్ణయించారు. అంటే జనాభా వివరాలను లెక్కించేటప్పుడు ఈ తేదీని ప్రాతిపదికగా తీసుకుంటారు.కేంద్ర ప్రభుత్వం అక్టోబర్ 30వ తేదీన విడుదల చేసిన నోటిఫికేషన్‌కు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం నవంబర్ 9వ తేదీన జీఓ జారీ చేసింది. రాష్ట్రంలోని అన్ని శాఖలు, జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, జనగణన అధికారులకు ఈ ఉత్తర్వులను పంపించారు. జనగణన–2027లో భాగంగా తెలంగాణలో తొలి విడతలో ఇళ్ల జాబితా తయారీ, గృహ గణన ప్రక్రియను మే 11వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు నిర్వహించారు. ఇప్పుడు రెండో విడతలో జనాభా లెక్కల సేకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం సన్నాహక సమావేశాలు, సిబ్బంది నియామకం, శిక్షణ వంటి కార్యక్రమాలు ఇప్పటికే ప్రారంభం అయ్యాయి.జనగణన దేశంలోని జనాభా పరిస్థితి, కుటుంబాల వివరాలు, సామాజిక, ఆర్థిక అంశాలపై కీలక సమాచారాన్ని అందిస్తుంది. ప్రభుత్వ పథకాల రూపకల్పన, వనరుల కేటాయింపు, అభివృద్ధి ప్రణాళికలకు ఈ గణాంకాలు ఉపయోగపడతాయి. అందువల్ల జనగణన సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు ప్రజలు సరైన వివరాలు అందించడం, స్వీయ జనగణనకు సంబంధించిన అధికారిక మార్గదర్శకాలను అనుసరించడం కీలకం కానుంది.

ఘోర రోడ్డు ప్రమాదం

- ఒకరు స్పాట్‌లో మృతి - రెండు బైకులు ఎదురెదురుగా ఢీ..
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- మృతుడు కడప జిల్లా బి.కోడూరు మండలానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్
- 167బీ జాతీయ రహదారిపై ఉప్పలపాడు స్టేజి వద్ద ప్రమాదం



సీఎస్‌పురం ప్రకాశం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సీఎస్‌పురం మండలం ఉప్పలపాడు స్టేజి సమీపంలోని మైదుకూరు సింగరాయకొండ 167బీ జాతీయ రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతిచెం దగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి.కడప జిల్లా బి.కోడూరు మండలం హైత్రంపే టకు చెందిన 23 ఏళ్ల కొండా వెంకటసుబ్బారెడ్డి ఈ ప్రమాదంలో స్పాట్‌లోనే మృతిచెందారు. ఇటీవలే సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో చేరిన వెంకటసుబ్బారెడ్డి వివాహితుడు కావడంతో కుటుంబంలో విషాదం నెలకొంది.అతనితో ఉన్న మామ సిద్ధారెడ్డికి కాలు విరగగా.. సీఎస్‌పురానికి చెందిన డ్రైవర్ పాశం వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలయ్యాయి.సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై పి. వెంకటేశ్వరరెడ్డి క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ఆసుపత్రులకు తరలించారు. పాశం వెంకటేశ్వర్లును ఒంగోలు తరలించగా.. సిద్ధారెడ్డిని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

మధ్యప్రదేశ్‌లో దీపావళి విషాదం..

- 2 ప్రమాదాల్లో 12 మంది మృతి..
- రెండు కుటుంబాలు బుగ్గి



భోపాల్: మధ్యప్రదేశ్‌లో దీపావళి రాత్రి పెను విషాదం చోటుచేసుకున్నది. రెండు వేర్వేరు అగ్నిప్రమాద ఘటనలు జరిగాయి. ఆ ప్రమాదాల్లో 12 మంది మృతిచెందారు. రెండు కుటుంబాలు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. కట్నీ, సియోని జిల్లాల్లో ఆదివారం రాత్రి ఈ ప్రమాదాలు జరిగాయి. కట్నీ జిల్లాలోని బర్హి పట్టణంలో ఓ అగర్వాల్ కుటుంబానికి చెందిన ఆరుగురు అగ్నిప్రమాదానికి బలయ్యారు. మూడు అంతస్తుల భవనంలో కింద క్రాకర్ షాపు ఉన్నది. అయితే పైఅంతస్తులో ఓ కుటుంబం నివసిస్తోంది. రాత్రి ప్రమాదం జరగడంతో మంటలు పైకి వ్యాపించాయి. నిద్రిస్తున్న సమయంలో ప్రమాదం జరగడంతో ఆరుగురు కాలి బూడిదయ్యారు. మృతులను పూరన్ అగర్వాల్, చంద్రకళ, పూనమ్, ఆర్యా, అన్వీగా గుర్తించారు. ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. తెల్లవారుజామున మృతదేహాలను వెలికితీశారు. షార్ట్ సర్క్యూట్ లేదా దీపాల వల్ల ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ఇక సియోనీ జిల్లాలోని చాపారా పట్టణంలో మరో ప్రమాదం జరిగింది. ఓ నగల వ్యాపారి ఇంట్లో ప్రమాదం జరగడంతో ఆరుగురు మృతిచెందారు. మృతులను కుందన్ లాల్ సోనీ, రాజ్‌కుమారి సోనీ, రీతూ సోనీ, స్మృతి సోనీ, సూర్య సోనీ, ఆదిత్య సోనీగా గుర్తించారు. మరో నలుగురు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. అగ్నిప్రమాద సమయంలో ఇంట్లో పది మంది ఉన్నారు. గాఢ నిద్రలో ఉనప్పుడు ప్రమాదం జరిగిందని పోలీసులు చెబుతున్నారు. రెండు ఘటనలు మధ్యప్రదేశ్‌లో తీవ్ర విషాదాన్ని నింపాయి.

కొడంగల్ మాజీ ఎమ్మెల్యే

పట్నం నరేందర్ రెడ్డి అరెస్ట్

పరిగి కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ని పోలీసులు అరెస్ట్ చేసారు. కోస్గిలో మృతి చెందిన కార్యకర్తల అంత్యక్రియలకు వెళ్తుండగా పరిగి వద్ద నరేందర్ రెడ్డిని పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వస్తున్నందుకు అదుపులోకి తీసుకుంటు న్నారని నరేందర్ రెడ్డి ఆరోపించారు.

ఇరుకు వంతెన కారణంగా

ట్రాఫిక్‌లో ఇరుక్కున్న అంబులెన్స్

- ప్రాణాలతో చెలగాటం.. పట్టించుకోని అధికారులు



గోకవరం గోకవరం లోని ఇరుకు వంతెన వద్ద ఆదివారం భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రోగితో వెళ్తున్న 108 అంబులెన్స్ వంతెనపై ట్రాఫిక్ లో ఇరుక్కుపోయి దాదాపు అరగంట పాటు ముందుకు కదల్లేకపోయింది.వంతెన చాలా ఇరుకుగా ఉండటంతో ఒకేసారి రెండు వాహనాలు వెళ్లలేని పరిస్థితి. దీనికి తోడు ఇరువైపులా బైకులు, ఆటోలు, బస్సులు రావడంతో రోడ్డు పూర్తిగా స్తంభించిపోయింది. అంబులెన్స్ డ్రైవర్ సైరన్ మోగించినా, వాహనదారులు దారి ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది.దీంతో అంబులెన్స్ లో ఉన్న రోగి కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. స్థానికులు కొందరు ముందుకొచ్చి వాహనాలను పక్కకు జరిపి అంబులెన్స్ కు దారి ఇవ్వడంతో అది నెమ్మదిగా ముందుకు సాగింది.గోకవరం వంతెన సమస్య ఇది కొత్తది కాదని, రోజూ ఇదే పరిస్థితి ఉంటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సమయంలో అంబులెన్స్ లు ఇక్కడే ఇరుక్కుపోతున్నాయని, ఎన్నోసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని మండిపడుతున్నా రు.బిజ్జి పనులు త్వరగా పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు

హైదరాబాద్‌లో టపాసుల వివాదం

- కత్తులతో దాడి.. ముగ్గురిపై హత్యాయత్నం - రోడ్డుపై వెళ్తున్న చిన్నారిపై టపాసు విసరడంతో వివాదం..
- ప్రశ్నించిన మేనమామతో వాగ్వాదం.. ముగ్గురిపై కత్తులతో దాడి



హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలోని పటేల్‌నగర్, గాంధీభవన్ ప్రాంతంలో టపాసులు పేల్చే విషయంలో తలెత్తిన వివాదం తీవ్ర ఘర్షణకు దారితీసింది. చిన్నారిపై టపాసు విసరడాన్ని ప్రశ్నించినందుకు ముగ్గురు వ్యక్తులపై కత్తులతో దాడి జరిగిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ దాడిలో షేక్ వహీద్, షేక్ ఇమ్రాన్, షేక్ షాబాజ్ గాయపడ్డారు. చిన్నారిపై టపాసు విసరడంతో మొదలైన గొడవ : అందిన ప్రాథమిక సమాచారం ప్రకారం.. పటేల్‌నగర్, గాంధీభవన్ ప్రాంతంలో రోడ్డుపై వెళ్తున్న ఓ చిన్నారిపై కొందరు వ్యక్తులు టపాసు విసిరినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని గమనించిన చిన్నారి మేనమామ వారిని ప్రశ్నించడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మాటామాటా పెరగడంతో వివాదం తీవ్రరూపం దాల్చింది. సల్మాన్, అర్బాజ్‌తో పాటు మరికొందరు కత్తులతో దాడి : చిన్నారిపై టపాసు విసిరిన విషయాన్ని ప్రశ్నించడంతో మొదలైన గొడవలో సల్మాన్, అర్బాజ్‌తో పాటు మరికొందరు వ్యక్తులు ముగ్గురిపై కత్తులతో దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ దాడిలో షేక్ వహీద్, షేక్ ఇమ్రాన్, షేక్ షాబాజ్ తీవ్రంగా గాయపడ్డారు. దాడి అనంతరం స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యులు వారికి చికిత్స అందిస్తున్నారు. బేగంబజార్ పోలీసుల దర్యాప్తు : ఘటనపై సమాచారం అందుకున్న బేగంబజార్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఘర్షణకు అసలు కారణాలు ఏమిటి? దాడిలో ఎవరెవరు పాల్గొన్నారు? అనే కోణాల్లో పోలీసులు విచారణ జరుపుతున్నారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకునే దిశగా దర్యాప్తు కొనసాగుతోంది.

చిన్నారుల భద్రతను విస్మరించొద్దు.. వివాదాలతో ప్రాణాలు తీసుకోవద్దు! పండుగల సమయంలో టపాసులు కాల్చేటప్పుడు చిన్నారుల భద్రత పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా టపాసులు విసరడం ప్రమాదకరం. ఎవరైనా తప్పు చేస్తే చట్టపరంగా ప్రశ్నించాలి తప్ప, కత్తులతో దాడులకు దిగడం ఏమాత్రం సమర్థనీయం కాదు. చిన్నపాటి వివాదాలు ప్రాణాపాయ పరిస్థితులకు దారితీయడం సమాజానికి ఆందోళన కలిగించే విషయం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలి.

అధికారుల నిర్లక్ష్యం

వృథాగా పోతున్న భగీరథ నీళ్లు



మాగనూరు ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి భవిష్యత్తు అవసరాల కోసం ఆదా చేయాలని ప్రభుత్వం ఒకవైపు ప్రచారం చేస్తుంటే.. మరోవైపు ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడిచేలా మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. మాగనూరు మండల కేంద్రంలో మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ పగిలి మూడు రోజులైనా సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో విలువైన తాగునీరు వృథాగా పారుతూ చెరువును తలపిస్తోంది. పైప్‌లైన్ నుంచి బయటకు వస్తున్న నీరు పరిసర ప్రాంతాల్లో పెద్దఎత్తున నిలిచిపోవడంతో నీటి వనరులు వృథా కావడమే కాకుండా పరిసర ప్రాంతాలు చిత్తడిగా మారుతున్నాయి. ఒకవైపు మాగనూరు కృష్ణ మండల పరిధిలోని ఎనిమిది గ్రామాల ప్రజలు మిషన్ భగీరథ ద్వారా సక్రమంగా తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతుంటే.. మరోవైపు పైప్‌లైన్ పగిలి నీరు వృథాగా పోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజులుగా నీరు వృథాగా పారుతున్నా అధికారులు కనీసం మరమ్మతులు చేపట్టకపోవడం వారి పనితీరుకు అద్దం పడుతోంది. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించాల నే లక్ష్యంతో మిషన్ భగీరథ పథకాన్ని అమలు చేస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యం కారణంగా పథకం లక్ష్యం నీరుగారుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మాగనూరు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ముందు జాతీయ రహదారి పక్కన ప్రజలకు తాగునీరు అందించాల్సిన పైప్‌లైన్ల నుంచే నీరు వృథాగా ప్రవహిస్తుంది. నీటి సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పే ప్రభుత్వ యంత్రాంగం ముందుగా తన శాఖల పరిధిలో జరుగుతున్న నీటి వృథాను అరికట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

శాంతియుతంగా పంచాయతీ

ఎన్నికల నిర్వహణకు సిద్ధం కావాలి

- విజయనగరం జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్,

విజయనగరం : జిల్లాలో పంచాయతీ ఎన్నికలను, రాజాం మున్సిపల్ ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు పోలీసు అధికారులు, సిబ్బంది సిద్ధంగా కావాలని, అందుకు తగిన ప్రణాళికలను రూపొందించుకోవాలని అధికారులను జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్, ఆదేశించారు.జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఎస్.ఈ.సి. షెడ్యూల్ విడుదల చేసినందున, అందుకు తగినవిధంగా సంబంధిత డీఎస్పీలు భద్రత, బందోబస్తు ప్రణాళికలు రూపొందించాలన్నారు. రాజాం మున్సిపల్ ఎన్నికలు కూడా త్వరలో నిర్వహించాల్సి ఉందని, అందుకు తగిన విధంగా భద్రత చర్యలు చేపట్టాలన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది తమ పరిధిలోగల గ్రామాలను సందర్శించి, ఎన్నికల నిర్వహణలో ఎటువంటి శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో అల్లర్లు సృష్టించేందుకు అవకాశం ఉన్న వ్యక్తులను గుర్తించి, మంచి ప్రవర్తన కోసం ఎం.ఈ.ఎం. కోర్టుల్లో బైండోవరు చేయాలని, వారి వద్ద నుండి స్వంత పూచీకత్తుగా రూ. 2 – 3 లక్షలకు వరకు బాండ్లను తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే రౌడీషీట్లు కలిగిన వారిని బైండోవరు చేయడంతోపాటు, తరుచూ గంజాయి నేరాలకు పాల్పడుతున్న వ్యక్తులను, శాంతిభద్రతల సమస్యలకు కారణం అవుతున్న 20మందిని గుర్తించి, వారిపై పి.డి.యాక్ట్ నమోదు చేసి, సం. వరకు బెయిల్ రాకుండా చర్యలు చేపట్టామన్నారు. రాజాం మున్సిపల్ ఎన్నికలను త్వరలో నిర్వహించాల్సి ఉన్నందున క్షేత్ర స్థాయిలో వార్డులను సందర్శించాలని, శాంతియుతంగా ఎన్నికల నిర్వహణకు భద్రత చర్యలు చేపట్టాలని రాజాం సిఐని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద కాంపౌండ్ వాల్ ఉండే విధంగా చూడాలని, కాంపౌండ్ లేకుంటే బారికేడ్లను ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ జరిగిన కేంద్రంలోనే ఎన్నికల కౌంటింగ్ చేపట్టనున్నందున అధికారులు, సిబ్బంది మరింత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు.× పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు సూచనలు చేసేందుకు పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టమ్స్, బెల్ హెల్లర్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలను, రాజాం మున్సిపల్ ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు అధికారులు ఇప్పటి వరకు చేపట్టిన చర్యలను తెలుసుకొని, ఇంకనూ వారు తీసుకోవాల్సిన భద్రత చర్యలపై జిల్లా ఎస్పీ దిశా నిర్దేశం చేశారు.

మైలార్‌దేవ్‌పల్లిలో వరుసఅగ్నిప్రమాదాలు.

రంగారెడ్డి దీపావళి పండుగ వేళ రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లి ప్రాంతంలో వరుస అగ్నిప్రమాదాలు కలకలం రేపాయి. కాటేదాన్ పారిశ్రామికవాడలోని హెచ్‌కే ప్లాస్టిక్ కంపెనీలో భారీ అగ్నిప్రమాదం జరగగా, మరోవైపు దాసరి బస్తీ సమీపంలోని డెకరేషన్ గోదాంలోనూ మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.వివరాల్లోకి వెళితే. ఒకేరోజు రెండు అగ్నిప్రమాదాలు జరగడంతో పండుగ వేళ ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇళ్ల మధ్యలో ఉన్న డెకరేషన్ గోదాంలో మంటలు వ్యాపించడంతో చుట్టుపక్కల నివాసితులు ప్రాణభయంతో పరుగులు తీశారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలాలకు చేరుకుని మంటలను అదుపు చేసేందుకు చర్యలు చేపట్టారు.ప్రాంతంలో ఫైర్ స్టేషన్ లేకపోవడం, నివాస ప్రాంతాల మధ్య ఇలాంటి గోదాంల నిర్వహణపై సరైన పర్యవేక్షణ లేకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే అక్రమ వ్యాపారాలపై అధికారులు తక్షణమే తనిఖీలు చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

అర్హులైన ప్రతి కుటుంబానికి

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

- ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్ర నాయక్



డోర్నకల్ మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమంలో భాగంగా 3వ, 4వ, 5వ వార్డులకు చెందిన లబ్ధిదారులకు రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డోర్నకల్ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్ర నాయక్ హాజరై లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు,మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మరిపెడ మున్సిపల్ చైర్మన్ ప్రగతి శ్రీపాల్ రెడ్డి గారు, మున్సిపల్ వైస్ చైర్మన్ కాలం సునీత రవీందర్ రెడ్డి గారు, సంబంధిత వార్డుల కౌన్సిలర్లు, మండల అధ్యక్షులు రవి నాయక్ , టౌన్ అధ్యక్షులు రామ్‌లాల్ నాయక్ , మాజీ మండల అధ్యక్షులు పెండ్లి రఘువీర్ రెడ్డి , మరిపెడ ఎమ్మార్వో, ఎంపీడీవో, మండల నాయకులు, వార్డు ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసి గుడేల్లో మార్మోగుతున్న దండారి వేడుకలు

నార్నూర్ : అదిలాబాద్ జిల్లా నార్నూర్ గాదిగూడ మండలాల పరిధిలోని ఆదివాసి గూడేల్లో దండారి వేడుకలు మార్మోగుతున్నాయి. డప్పుల చప్పుడు.. కోలాటం, గుస్సాడి నృత్యాలతో ఆధ్యాత్మికత ఆకట్టుకుంటుంది. చిన్న పెద్ద తేడా లేకుండా దండారి వేడుకలలో పాల్గొంటున్నారు. కొల బోడి తో దండారి వేడుకలు ముగిస్తాయని దండారి నిర్వాహకులు పేర్కొంటున్నారు. గాదిగూడ మండలంలోని రోమన్ కసాలో దండాలు ఉత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలలో టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు యూన్సీ అక్బానీ, గాదిగూడ మండలం మాజీ వైస్ ఎంపీపీ మర్సివనే యోగేష్ దండారి కార్యక్రమాలలో పాల్గొని గుస్సాడీలను, నిర్వాహకులను, గ్రామ పటేళ్లను శాలువతో సన్మానించారు, కానుకలు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోడం నర్మద జంగు, బి.ఆర్. ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పూసం బాదిరావ్, మాజీ సర్పంచ్ ఇంద్రభాన్, గ్రామ పెద్దలు ఉన్నారు.

ఆదివాసి గుడేల్లో మార్మోగుతున్న దండారి వేడుకలు



నార్నూర్ : అదిలాబాద్ జిల్లా నార్నూర్ గాదిగూడ మండలాల పరిధిలోని ఆదివాసి గూడేల్లో దండారి వేడుకలు మార్మోగుతున్నాయి. డప్పుల చప్పుడు.. కోలాటం, గుస్సాడి నృత్యాలతో ఆధ్యాత్మికత ఆకట్టుకుంటుంది. చిన్న పెద్ద తేడా లేకుండా దండారి వేడుకలలో పాల్గొంటున్నారు. కొల బోడి తో దండారి వేడుకలు ముగిస్తాయని దండారి నిర్వాహకులు పేర్కొంటున్నారు. గాదిగూడ మండలంలోని రోమన్ కసాలో దండాలు ఉత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలలో టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు యూన్సీ అక్బానీ, గాదిగూడ మండలం మాజీ వైస్ ఎంపీపీ మర్సివనే యోగేష్ దండారి కార్యక్రమాలలో పాల్గొని గుస్సాడీలను, నిర్వాహకులను, గ్రామ పటేళ్లను శాలువతో సన్మానించారు, కానుకలు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోడం నర్మద జంగు, బి.ఆర్. ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పూసం బాదిరావ్, మాజీ సర్పంచ్ ఇంద్రభాన్, గ్రామ పెద్దలు ఉన్నారు.

మరో 20 ఏళ్లు కూటమిదే అధికారం

స్థానిక ఎన్నికల్లో ఎన్డీఏకు ప్రజల బ్రహ్మరథం

విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని ధీమా.. డిప్యూటీ మేయర్ టీడీపీకి



విజయవాడ(ప్రశ్న న్యూస్) స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి ప్రజలు అఖండ విజయాన్ని అందించారని, రాబోయే మరో 20 ఏళ్ల పాటు రాష్ట్రంలో కూటమిదే అధికారం ఉంటుందన్న నమ్మకం కలుగుతోందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు ఇచ్చిన తీర్పు కూటమి ప్రభుత్వంపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ నాయకత్వంపై ప్రజలకు సంపూర్ణ నమ్మకం ఉందని తెలిపారు. విజయవాడలోని తన కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడిన ఎంపీ.. స్థానిక ఎన్నికల్లో కూటమికి ఘన విజయాన్ని అందించిన ఓటర్లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కూటమి పార్టీల మధ్య సమన్వయం, నాయకులు, కార్యకర్తల సమష్టి కృషి విజయానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు.

ప్రజా తీర్పుతో కూటమికి మరింత బలం..

విజయవాడ నగరంతో పాటు ఎన్టీఆర్ జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగాయని ఎంపీ తెలిపారు. ఎక్కడా అక్రమాలకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియ ముగిసిందని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఎన్డీఏ కూటమికి బ్రహ్మరథం పట్టారని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వానికి మరోసారి తమ మద్దతును ప్రకటించారని అన్నారు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోటీ చేసినప్పటికీ కూటమి విజయాన్ని అడ్డుకోలేకపోయిందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు ఇచ్చిన గుర్తింపే ఈ ఫలితాలకు కారణమని అభివర్ణించారు.

స్థానిక సమరంలో కూటమికి తిరుగులేని తీర్పు

- చంద్రబాబు పాలనకు జనం జై.. లోకేశ్ దూకుడుకు ప్రజా ముద్ర

- ఉండవల్లిలో సీఎంను కలిసి అభినందించిన: టీడీపీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ దారపనేని నరేంద్రబాబు



ఉండవల్లి(ప్రశ్న న్యూస్) స్థానిక సంస్థల ఎన్నికల సమరంలో కూటమి సాధించిన ఘన విజయం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. మున్సిపల్, పరిషత్ ఎన్నికల్లో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి సాధించిన విజయాన్ని సుపరిపాలనకు ప్రజలు ఇచ్చిన పట్టంగా టీడీపీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ దారపనేని నరేంద్రబాబు అభివర్ణించారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో ఉన్న విశ్వాసానికి ఈ ఫలితాలే నిదర్శనమని పేర్కొన్నారు.కూటమి ఘన విజయంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును నరేంద్రబాబు ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్టీఆర్ విగ్రహ ప్రతిమను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, ఎన్నికల ఫలితాలపై తన అభిప్రాయాలను ముఖ్యమంత్రితో పంచుకున్నారు.

సంక్షేమమే విజయ మంత్రం..

చంద్రబాబు అనుభవం, పాలనా దక్షత రాష్ట్రానికి దిశానిర్దేశం చేస్తున్నాయని నరేంద్రబాబు పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కూటమికి అనుకూల వాతావరణాన్ని సృష్టించాయని తెలిపారు. ముఖ్యంగా 'సూపర్ సిక్స్' హామీల అమలు, పారదర్శక పాలన పట్ల ప్రజలు సానుకూలంగా స్పందించారని చెప్పారు.

లోకేశ్ సంస్కరణలకు గుర్తింపు..

యువనేత నారా లోకేశ్ విద్యా, ఉపాధి రంగాల్లో చేపడుతున్న సంస్కరణలు, యువతకు అవకాశాలు కల్పించేందుకు చేస్తున్న ప్రయత్నాలు ప్రజల్లో నమ్మకాన్ని పెంచాయని నరేంద్రబాబు అన్నారు. పార్టీ శ్రేణుల్లో ఆయన నింపుతున్న ఉత్సాహం, క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేస్తున్న తీరు కూటమి విజయానికి బలాన్నిచ్చాయని పేర్కొన్నారు.

బేగంబజార్‌లో భారీ జూద ముఠా గుట్టురట్టు

గోషామహల్ పోలీసుల దాడి16 మంది అరెస్ట్, 12 మంది పరారీ



గోషామహల్(ప్రశ్న న్యూస్) నగరంలో చట్టవిరుద్ధంగా నిర్వహిస్తున్న జూద స్థావరాలపై గోషామహల్ పోలీసులు మెరుపు దాడి చేసి భారీ జూద ముఠా గుట్టురట్టు చేశారు. కామన్ గేమింగ్ హౌస్ నిర్వహిస్తూ పేకాట ఆడుతున్న 16 మంది నిందితులను అరెస్ట్ చేయగా, మరో 12 మంది నిందితులు పరారీలో ఉన్నారు.గోషామహల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బేగంబజార్, ఫిష్ మార్కెట్ వద్ద ఉన్న 'ధనలక్ష్మి ఫిష్ గోదాం'లో చట్టవిరుద్ధంగా "అందర్–బాహర్", "తీన్ పత్తి" పేకాట శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీని ఆధారంగా నవంబర్ 8 ఆదివారం నాడు అర్ధరాత్రి 00:20 గంటల సమయంలో గోషామహల్ పోలీసులు దాడి నిర్వహించారు. రెండు పక్క పక్క గదుల్లో డబ్బులతో పేకాట ఆడుతున్న 16 మందిని అదుపులోకి తీసుకున్నారు.ఈ ఘటనపై గోషామహల్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్: 419/2026, సెక్షన్ 3 ఆ 4 తెలంగాణ గేమింగ్ యాక్ట్, 112(2) బి.ఎన్.ఎస్ కింద కేసులు నమోదు చేశారు.పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం గాలింపు చర్యలు వేగవంతం చేశామని, త్వరితగతిన విచారణ పూర్తి చేస్తామని గోషామహల్ పోలీసులు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు మరియు ప్రజా భద్రతకు హైదరాబాద్ నగర పోలీసులు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటారని, ఇటువంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని గోషామహల్ ఇన్స్పెక్టర్ శ్రవణ్ కుమార్ హెచ్చరించారు.

కార్తీక మాసానికి ఇంద్రకీలాద్రిపై ఆధ్యాత్మిక శోభ

- శాస్త్రోక్తంగా ఆకాశ దీపం ఏర్పాటు - ప్రదోష వేళ వేద మంత్రోచ్ఛారణల నడుమ విశేష పూజలు

- నెలరోజుల పాటు వైదిక సేవలకు విస్తృత ఏర్పాట్లు



విజయవాడ(ప్రశ్న న్యూస్) కార్తీక మాసం ప్రారంభంతో ఇంద్రకీలాద్రిపై ఆధ్యాత్మిక సందడి నెలకొంది. శ్రీ పరాభవ నామ సంవత్సర కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం ప్రదోష వేళ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఆకాశ దీపం ఏర్పాటు కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా, వైభవంగా నిర్వహించారు.వేద మంత్రోచ్ఛారణలు, ప్రత్యేక పూజల నడుమ అమ్మవారు, మల్లేశ్వర స్వామి, నటరాజ స్వామి ఆలయాల్లో ఈ విశేష క్రతువు జరిగింది.

వేద మంత్రాల నడుమ ఆకాశ దీపం..

దేవస్థాన స్థానాచార్యుల ఆధ్వర్యంలో శ్రీ కనకదుర్గమ్మవారి సన్నిధి, శ్రీ మల్లేశ్వర స్వామివారి ఆలయం, శ్రీ నటరాజ స్వామివారి ఆలయంలో ఆకాశ దీపాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ ధ్వజానికి ఆకాశ దీపాన్ని శాస్త్రోక్తంగా వెలిగించి ఏర్పాటు చేసినట్లు అర్చకస్వాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ట్రస్ట్ బోర్డు చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రదోష వేళ దీపదర్శనంతో సర్వశుభాలు...

కార్తీక మాసంలో ప్రదోష కాలంలో ఆకాశ దీపాన్ని దర్శించుకోవడం విశేష పుణ్యప్రదమని అర్చకులు తెలిపారు. ఆకాశ దీప దర్శనంతో పాపాలు తొలగి, అకాల మృత్యు భయాలు దూరమై, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సర్వశుభాలు కలుగుతాయని శాస్త్ర వచనాలు పేర్కొంటున్నట్లు వివరించారు. సకల లోకాలకు శాంతి, సౌభాగ్యాలు కలగాలని ఆకాంక్షిస్తూ ఈ దివ్య దీపాన్ని వెలిగించినట్లు తెలిపారు.

కార్తీక మాసంలో దీపారాధనకు ఉన్న విశిష్టతను చాటుతూ ఇంద్రకీలాద్రిపై ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

నెలరోజుల పాటు వైదిక సేవలు..

కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై నెలరోజుల పాటు నిర్వహించనున్న విశేష అభిషేకాలు, బిల్వార్చనలు, లక్ష్మీ గణపతి పంచాక్షరీ పారాయణాలు తదితర వైదిక సేవలకు దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేసినట్లు ఈవో వి.కె. శీనా నాయక్ తెలిపారు.

భక్తులు ఈ సేవల్లో పాల్గొనేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవస్థాన అర్చకులు, వైదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కార్తీక మాసానికి శ్రీశైలంలో ఆధ్యాత్మిక వైభవం

- నవంబర్ 10 నుంచి నెలరోజుల పాటు కార్తీకమాసోత్సవాలు..

- కోటి దీపోత్సవం.. జ్వాలాతోరణం.. పుష్కరిణి హారతులతో భక్తి సందడి

- పంచమఠాల్లో రూ.216కే ఆర్జిత అభిషేకం.. భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు..





శ్రీశైలం(ప్రశ్న న్యూస్) కార్తీక మాస పవిత్రత.. పరమశివుని ఆరాధన.. దీపాల వెలుగుల్లో ఆధ్యాత్మిక వైభవం.. భక్తుల శివనామస్మరణతో శ్రీశైల మహాక్షేత్రం మరోసారి పుణ్యకార్యాలకు సిద్ధమవుతోంది. నవంబర్ 10 నుంచి డిసెంబర్ 9 వరకు నెలరోజుల పాటు శ్రీశైలంలో కార్తీకమాసోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేసింది. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించడంతో పాటు కోటి దీపోత్సవం, లక్షదీపోత్సవం, జ్వాలాతోరణం, కృష్ణమ్మహారతి వంటి విశేష ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు, ఈవో ఎం. శ్రీనివాసరావు తెలిపారు.

కార్తీకమాసంలో ప్రత్యేక పూజలు.. విశేష ఉత్సవాలు..

కార్తీక మాసంలో శివారాధనకు విశేష ప్రాధాన్యత ఉన్న నేపథ్యంలో శ్రీశైల క్షేత్రంలో ప్రతిరోజూ ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. స్వామివారికి ఆకాశదీపం ఏర్పాటు, అఖండ శివభజనలు, కార్తీక దీపారాధనలు, ధార్మిక సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.కార్తీక సోమవారాలు, కార్తీక పౌర్ణమి రోజుల్లో పుష్కరిణి వద్ద లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతి నిర్వహించనున్నారు. నవంబర్ 20న కార్తీక శుద్ధ ఏకాదశి సందర్భంగా ఆగమ పాఠశాల ఎదురుగా ఉన్న మైదానంలో కోటి దీపోత్సవం జరగనుంది. నవంబర్ 24న కార్తీక పౌర్ణమి సందర్భంగా గంగాధర మండపం వద్ద జ్వాలాతోరణోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పంచమఠాల్లో రూ.216కే అభిషేకం..

కార్తీక మాసంలో భక్తులు పరమేశ్వరునికి అభిషేకాలు నిర్వహించుకునేందుకు దేవస్థానం ప్రత్యేక అవకాశం కల్పిస్తోంది. ఈ ఏడాది పంచమఠాల్లో ఆర్జిత అభిషేకాలను ప్రవేశపెట్టింది. కేవలం రూ.216 రుసుముతో భక్తులు అభిషేకం చేసుకునే అవకాశం కల్పించినట్లు అధికారులు తెలిపారు.ఒక టికెట్‌పై దంపతులు లేదా ఒకరు అభిషేకంలో పాల్గొనవచ్చు. అభిషేకానికి అవసరమైన పూజా సామగ్రిని దేవస్థానమే సమకూర్చుతుంది. భక్తులు తమ అభీష్టం మేరకు ఘంటామఠం, భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధర మఠాలలో ఏదైనా ఒక మఠంలో అభిషేకం చేసుకోవచ్చు.

టికెట్లను మనమిత్ర వాట్సాప్ నంబర్ 9552300009, ఏపీటీఎన్ వెబ్‌సైట్ ఎఎఫ్.ఎం.ఖజూ.స్థశీజ.అఅ ద్వారా పొందవచ్చని దేవస్థానం తెలిపింది.

గర్భాలయ అభిషేకాలు నిలిపివేత..

కార్తీక మాసంలో భక్తుల రద్దీ అధికంగా ఉండనున్న నేపథ్యంలో సాధారణ భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు గర్భాలయ అభిషేకాలు, సామూహిక ఆర్జిత అభిషేకాలను నెలరోజుల పాటు పూర్తిగా నిలిపివేయనున్నారు.శని, ఆదివారాలు, సోమవారాలు, ఇతర పర్వదినాల్లో స్వామివారి స్పర్శదర్శనాన్ని పూర్తిగా నిలిపివేస్తారు. సాధారణ రోజుల్లో మాత్రం నిర్దిష్ట సమయాల్లో ఐదు విడతలుగా స్పర్శదర్శనానికి అవకాశం కల్పించనున్నారు. సర్వదర్శనం క్యూలైన్లకు ఇబ్బందులు కలగకుండా విడతలవారీగా ఈ దర్శనాలను నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.కార్తీక మాసంలో శని, ఆది, సోమవారాలు, పర్వదినాల్లో అమ్మవారి అంతరాలయంలో నిర్వహించే కుంకుమార్చనలను ఆశీర్వచన మండపంలో నిర్వహించనున్నారు. రూ.1,000 రుసుముతో జరిగే ఈ సేవలకు సంబంధించి ఏర్పాట్లు చేశారు. రుద్రహోమం, చండీహోమం, సాక్షిగణపతి హోమం, నిత్యకల్యాణం తదితర ఆర్జిత సేవలు యథావిధిగా కొనసాగనున్నాయి.

భక్తులకు అన్నప్రసాదం.. అదనపు లడ్డూ కౌంటర్లు..

కార్తీక మాసంలో భక్తుల రద్దీకి అనుగుణంగా అన్నప్రసాదం, అల్పాహారం, తాగునీటి ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 10.45 గంటల నుంచి అన్నప్రసాద వితరణ ప్రారంభం కానుంది. సాయంత్రం 7 గంటల నుంచి అల్పాహారం అందించనున్నారు. దర్శనానికి క్యూకాంప్లెక్స్‌లో వేచి ఉండే భక్తులకు తాగునీరు, బిస్కెట్లు, అల్పాహారం అందించనున్నారు.

రద్దీ ఎక్కువగా ఉండే రోజుల్లో ఉదయం వేళ వేడిపాలు కూడా పంపిణీ చేయనున్నారు.

లడ్డూ ప్రసాదాల కోసం అదనంగా ఆరు కౌంటర్లు ఏర్పాటు చేసి మొత్తం 14 కౌంటర్ల ద్వారా ప్రసాదాలను అందించనున్నారు. భక్తుల అవసరాలకు అనుగుణంగా తగిన సంఖ్యలో లడ్డూలను సిద్ధం చేయనున్నారు.

కార్తీక మాసం సందర్భంగా శ్రీశైలంలో నిర్వహించనున్న విశేష పూజలు, దీపోత్సవాలు, వైదిక సేవలు భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందించనున్నాయి. భక్తుల రద్దీకి అనుగుణంగా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ, స్వామివారి దర్శనం సౌకర్యవంతంగా జరిగేలా చర్యలు

ప్రపంచ పెట్టుబడులకు విశాఖ వేదిక, ఏపీ పారిశ్రామిక ప్రగతికి కొత్త దిశ

-రూ.86,522 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు 1.47 లక్షల ఉద్యోగాలపై ఆశలు

- నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖలో అంతర్జాతీయ పారిశ్రామిక సమ్మిట్



అమరావతి(ప్రశ్న న్యూస్) మారుతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఆంధ్రప్రదేశ్‌ను అంతర్జాతీయ పెట్టుబడులకు కీలక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో విశాఖ వేదికగా భారీ పారిశ్రామిక సమ్మిట్‌కు రంగం సిద్ధమైంది. 'నేవిగేటింగ్ న్యూ వరల్డ్ ఆర్డర్' థీమ్‌తో ఈ నెల 12, 13 తేదీల్లో నిర్వహించనున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి నూతన దిశానిర్దేశం చేయనుంది. ప్రపంచ దేశాల ప్రభుత్వ ప్రతినిధులు, పారిశ్రామిక దిగ్గజాలు, సాంకేతిక నిపుణులు ఒకే వేదికపైకి రానుండటంతో విశాఖ అంతర్జాతీయ పెట్టుబడుల కేంద్రంగా మరోసారి ప్రత్యేక గుర్తింపు పొందనుంది.వాణిజ్యం నుంచి క్వాంటం టెక్నాలజీ వరకు ఆరు ప్రధాన అంశాలపై చర్చలు, అంతర్జాతీయ భాగస్వామ్యాలు, పెట్టుబడుల ఒప్పందాలకు ఈ సదస్సు వేదిక కానుంది. ఇప్పటికే ఆరు ప్రాంతీయ సన్నాహక సదస్సుల ద్వారా రూ.86,522 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు రావడం రాష్ట్ర పారిశ్రామిక రంగంలో కొత్త ఆశలు రేకెత్తిస్తోంది.

58 దేశాలు.. 16 మంది విదేశీ మంత్రులు..

విశాఖలో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు 58 దేశాల ప్రభుత్వ, పారిశ్రామిక ప్రతినిధులు హాజరయ్యేందుకు నమోదు చేసుకున్నారు. ఇందులో 16 మంది విదేశీ మంత్రులు, 40 మంది అంతర్జాతీయ స్థాయి ప్రతినిధులు పాల్గొననున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.సింగపూర్, నేపాల్, కంబోడియా, మయన్మార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కెనడా, స్లోవాక్ రిపబ్లిక్, మారిషస్, మొజాంబిక్, ఈజిప్ట్, అల్జీరియా, టాంజానియా, గ్వాటెమాల తదితర దేశాల ప్రతినిధులు సదస్సులో పాల్గొననున్నారు. అంతర్జాతీయ రాయబారులు, పారిశ్రామిక ప్రముఖులు, సాంకేతిక నిపుణులతో పాటు వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్, ఆసియా అభివృద్ధి బ్యాంకు, యునెప్ వంటి సంస్థల ప్రతినిధులు కూడా హాజరుకానున్నారు. ప్రపంచ పెట్టుబడులు, అంతర్జాతీయ వాణిజ్యం, సాంకేతిక భాగస్వామ్యాలకు ఏపీని కీలక కేంద్రంగా నిలిపేలా చర్చలు సాగనున్నాయి.

చంద్రబాబు, అమిత్ షా.. దిగ్గజ పారిశ్రామికవేత్తల రాక..

సీఐఐ భాగస్వామ్య సదస్సుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయెల్, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, మంత్రి నారా లోకేశ్ తదితర ప్రముఖులు హాజరుకానున్నారు.కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయెల్ సదస్సుకు అధ్యక్షత వహించనుండగా, ముఖ్యమంత్రి చంద్రబాబు సహాధ్యక్షుడిగా వ్యవహరించనున్నారు. అంతర్జాతీయ పారిశ్రామిక సంస్థల చైర్మన్లు, సీఈఓలు, పెట్టుబడిదారులు పాల్గొననుండటంతో రాష్ట్రానికి కొత్త పారిశ్రామిక అవకాశాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది.నవంబర్ 12న ఉదయం 9.30 గంటలకు సదస్సు ప్రారంభం కానుంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, పీయూష్ గోయెల్, ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రహ్లాద్ జోషి, మంత్రి నారా లోకేశ్ తదితరులు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

నవంబర్ 13న సాయంత్రం 4 గంటలకు ముగింపు కార్యక్రమం నిర్వహించనున్నారు. భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి చంద్రబాబు తదితరులు పాల్గొననున్నారు.

అడవిలో కాలుపెడితే అదృశ్యమే: ఓటీటీలో 'ది వన్'



అది ఒక దట్టమైన అడవి .. పొద్దుపోయిన తరువాత ఆ అడవి వైపు ఎవరూ వెళ్లరు. ఏం కాదులే అంటూ అటుగా వెళ్లిన వాళ్లెవరూ తిరిగి రాలేదు. అడవిలో వనదేవత విహరిస్తూ ఉంటుందనీ .. ఆ సమయంలో ఎవరైనా అటుగా వెళితే చంపేస్తుందని అంతా భావిస్తుంటారు. అలాంటి పరిస్థితులలో 'రిషి' తన భార్య 'మమత'ను తీసుకుని ఆ గ్రామానికి చేరుకుంటాడు. తన పూర్వీకులకు సంబంధించిన ఆస్తిపాస్తులను అమ్ముకుని వెళ్లడానికి వస్తాడతను. తాను వచ్చిన పనిని పూర్తి చేయడానికి అడ్డుగా ఉన్న అడవిని టచ్ చేయడానికి అతను సిద్ధపడతాడు. ఆ గ్రామస్తులంతా కూడా ఆ అడవి వనదేవత నివాసమనీ, అలాంటి అడవి జోలికి వెళితే వనదేవతకి ఆగ్రహం కలుగుతుందని రిషికి చెబుతారు. అదంతా ఒక మూఢనమ్మకం అని భావించిన రిషి లైట్ తీసుకుంటాడు. తాను అనుకున్న పనిని పూర్తి చేసే తిరిగి వెళ్లాలని నిర్ణయించుకుంటాడు. అప్పటి నుంచి అతనికి ఎలాంటి చిత్రమైన అనుభవాలు ఎదురవుతాయి? దాంతో అతను తన నిర్ణయాన్ని మార్చుకుంటాడా? మూర్ఖంగా ముందుకు వెళతాడా? అనేది కథ. ఈ కథ అంతా కూడా 'ది వన్: ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్' అనే సినిమాకి సంబంధించినది. అడ్వెంచర్ తో ముడిపడిన హారర్ యాక్షన్ మూవీ ఇది. ఏక్తా కపూర్ – శోభా కపూర్ నిర్మించిన ఈ సినిమాకి, దీపక్ మిశ్రా దర్శకత్వం వహించాడు. సిద్ధార్థ్ మల్హోత్రా – తమన్నా ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సినిమా, సెప్టెంబర్ 25వ తేదీన థియేటర్లకు వచ్చింది. అమిత్ త్రివేది – సామ్ సీఎస్ నేపథ్య సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమా, ఈ నెల 6వ తేదీ నుంచి అమెజాన్ ప్రైమ్ లో స్ట్రీమింగ్ అవుతోంది.

భారీ నష్టాల దిశగా వెంకటేష్

'ఆదర్శ కుటుంబం'

– 10 రోజుల కలెక్షన్లు ఎంతంటే?



విక్టరీ వెంకటేష్, స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వచ్చిన తొలి చిత్రం 'ఆదర్శ కుటుంబం'. 'హౌస్ నెంబర్ 47' అనేది ఈ సినిమాకు ట్యాగ్‌లైన్. భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ ఫ్యామిలీ యాక్షన్ థ్రిల్లర్ బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోతోంది. విడుదలైన తొలి రోజుల్లో మిశ్రమ స్పందనను సొంతం చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం వసూళ్ల కోసం తీవ్రంగా శ్రమిస్తోంది. వీక్‌డేస్‌తో పోలిస్తే వీకెండ్‌లో కలెక్షన్లు కొంత పెరిగినప్పటికీ, సినిమా మాత్రం నష్టాల దిశగా పయనిస్తోందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. వెంకటేష్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో తెరకెక్కిన 'ఆదర్శ కుటుంబం'పై మొదటి నుంచి ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా వెంకటేష్ కామెడీ టైమింగ్, త్రివిక్రమ్ మార్క్ ఫ్యామిలీ ఎమోషన్స్ కలవడంతో ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంటుందని అభిమానులు ఆశించారు. ఇందులో శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటించగా, నారా రోహిత్, నివేతా పేతురాజ్, సత్య, రావు రమేష్, బ్రహ్మాజీ, యువీనా, రాజా ప్రజ్వల్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. అక్టోబర్ 30న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందన లభించింది. దీంతో బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో వసూళ్లు నమోదు కాలేదు. 'ఆదర్శ కుటుంబం' విడుదలై పది రోజులు పూర్తయ్యాయి. రెండో ఆదివారం కావడంతో పదో రోజు వసూళ్లలో కొంత పెరుగుదల కనిపించింది. అందుబాటులో ఉన్న ట్రేడ్ అంచనాల ప్రకారం, పదో రోజు ఈ సినిమా ఇండియాలో రూ.1.60 కోట్ల నెట్, రూ.1.85 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించింది. ఓవర్సీస్‌లో మరో రూ.10 లక్షలు రాబట్టింది. దీంతో రెండో ఆదివారం మొత్తం ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ.1.95 కోట్ల గ్రాస్ కలెక్షన్లు వచ్చినట్లు తెలుస్తోంది. శనివారంతో పోలిస్తే ఆదివారం వసూళ్లు మెరుగుపడటం కొంత ఊరటనిచ్చే అంశమే. అయితే ఈ పెరుగుదల సినిమా బాక్సాఫీస్ పరిస్థితిని మార్చే స్థాయిలో లేదని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇక పది రోజుల మొత్తం కలెక్షన్ల విషయానికి వస్తే, ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం సుమారు రూ.69.80 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించినట్లు సమాచారం. ఇందులో ఇండియా నుంచి రూ.53.20 కోట్లు రాగా, ఓవర్సీస్ మార్కెట్ నుంచి రూ.16.60 కోట్ల గ్రాస్ వచ్చినట్లు ట్రేడ్ లెక్కలు చెబుతున్నాయి. ఈ సినిమా బడ్జెట్ రూ.70 కోట్లకు పైగా ఉంటుందని ప్రచారం జరిగింది. ఇక థియేట్రికల్ బిజినెస్ సుమారు రూ.63 కోట్ల మేర జరిగినట్లు సమాచారం. ప్రాంతాల వారీగా చూస్తే నైజాంలో రూ.17 కోట్లు, సీడెడ్‌లో రూ.7 కోట్లు, ఆంధ్రాలో రూ.20 కోట్ల వ్యాపారం జరిగినట్లు తెలుస్తోంది. దీంతో ఏపీ, తెలంగాణలో కలిపి సుమారు రూ.44 కోట్ల థియేట్రికల్ బిజినెస్ జరిగినట్లు అంచనా. ఇక ఇతర రాష్ట్రాల్లో రూ.6 కోట్లు, ఓవర్సీస్‌లో రూ.13 కోట్ల మేర బిజినెస్ జరిగినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. మొత్తంగా ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా థియేట్రికల్ హక్కుల విలువ రూ.63 కోట్లుగా చెబుతున్నారు.ఈ లెక్కల ప్రకారం సినిమా బ్రేక్ ఈవెన్ సాధించాలంటే డిస్ట్రిబ్యూటర్లకు వచ్చే షేర్ పరంగా గణనీయమైన వసూళ్ల అవసరం.

శ్రీలీల సంచలన నిర్ణయం..

– రెమ్యునరేషన్ తగ్గించుకుంటోందా, వరుస ఫ్లాపుల ఎఫెక్ట్‌తో కొత్త ప్లాన్!

సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్ల కెరీర్ ఎప్పుడు ఎలాంటి మలుపు తిరుగుతుందో చెప్పడం కష్టం. ఒక సినిమా హిట్ అయితే అవకాశాలు క్యూ కడతాయి. అదే వరుసగా కొన్ని సినిమాలు పరాజయం పాలైతే అవకాశాల విషయంలో ఒడిదుడుకులు ఎదురవుతాయి. అయితే టాలీవుడ్ యంగ్ హీరోయిన్ శ్రీలీల విషయంలో మాత్రం పరిస్థితి కాస్త భిన్నంగా కనిపిస్తోంది. తెలుగులో ఆమె నటించిన కొన్ని సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాన్ని అందుకోకపోయినా, అవకాశాల విషయంలో మాత్రం ఈ బ్యూటీ వెనక్కి తగ్గడం లేదు. పైగా ఇతర భాషల్లోనూ వరుసగా భారీ ప్రాజెక్టుల్లో అవకాశాలు అందుకుంటూ తన కెరీర్‌ను కొత్త దిశగా తీసుకెళ్తోంది. ఇదిలా ఉంటే తాజాగా శ్రీలీలకు సంబంధించిన రెమ్యునరేషన్ వార్తలు ఇండస్ట్రీలో ఆసక్తికరంగా మారాయి. శ్రీలీలకు టాలీవుడ్‌లో మంచి గుర్తింపు తీసుకొచ్చిన సినిమాల్లో 'పెళ్లి సందడి' ఒకటి. ఈ సినిమా తర్వాత రవితేజ హీరోగా నటించిన 'ధమాకా' ఆమె కెరీర్‌ను ఒక్కసారిగా మలుపు తిప్పింది. ఈ సినిమా మంచి విజయం సాధించడంతో శ్రీలీలకు వరుస అవకాశాలు వచ్చాయి. తన అందం, అభినయం, ఎనర్జిటిక్ డ్యాన్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ముఖ్యంగా డ్యాన్స్ విషయంలో శ్రీలీలకు ప్రత్యేకమైన గుర్తింపు లభించింది. అద్భుతమైన గ్రేస్‌తో స్టెప్పులు వేయగలగడం ఆమెకు అదనపు బలంగా మారింది. దీంతో యువ హీరోలతో పాటు అగ్ర హీరోల సినిమాల్లోనూ నటించే అవకాశాలు దక్కాయి. తక్కువ సమయంలోనే టాలీవుడ్‌లో బిజీ హీరోయిన్‌గా మారిపోయింది. అయితే కెరీర్ ప్రారంభంలో వచ్చిన విజయాల తర్వాత శ్రీలీల నటించిన కొన్ని సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాలను అందుకోలేకపోయాయి. భారీ అంచనాల మధ్య విడుదలైన చిత్రాలు కూడా నిరాశపరచడంతో ఆమె కెరీర్‌పై రకరకాల చర్చలు మొదలయ్యాయి. అయినప్పటికీ శ్రీలీలకు అవకాశాలు తగ్గలేదు. శ్రీలీల ఇప్పటికే శివకార్తికేయన్ హీరోగా నటించిన 'పరాశక్తి' సినిమాతో తమిళ ప్రేక్షకులకు పరిచయమైంది. అలాగే ధనుష్, మమ్ముట్టి కీలక పాత్రల్లో నటిస్తున్న 'ఓం' సినిమాలోనూ భాగమైంది. ఇందులో ఆమె రోజా అనే పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ఇదే కాకుండా సూపర్ స్టార్ రజనీకాంత్ నటిస్తున్న 'ధర్మన్' సినిమాలోనూ శ్రీలీలకు అవకాశం దక్కినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. కమల్ హాసన్ నిర్మాణంలో అశ్వత్ మారిముత్తు తెరకెక్కిస్తున్న ఈ ప్రాజెక్టుపై కూడా ఆసక్తి నెలకొంది. మరోవైపు అజిత్ కుమార్ నటిస్తున్న 'డేర్‌డెవిల్' సినిమాలోనూ ఆమె నటించబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉంటే శ్రీలీలకు సంబంధించి ప్రస్తుతం వినిపిస్తున్న మరో ఆసక్తికరమైన వార్త ఆమె రెమ్యునరేషన్‌కు సంబంధించినది. వరుస సినిమాలు చేస్తున్నప్పటికీ, కొన్ని చిత్రాలు ఆశించిన విజయాన్ని అందుకోకపోవడంతో ఆమె తన పారితోషికాన్ని తగ్గించుకునే ఆలోచనలో ఉందనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటివరకు తనకున్న క్రేజ్, డిమాండ్‌ను బట్టి పారితోషికం తీసుకున్న శ్రీలీల.. ఇప్పుడు నిర్మాతలకు మరింత అందుబాటులో ఉండేలా రెమ్యునరేషన్ విషయంలో సర్దుబాటు చేసుకోవాలని భావిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. అయితే ఆమె నిజంగానే పారితోషికం తగ్గించుకున్నారా? ఎంత మేరకు తగ్గించారు? అనే విషయాలపై ఎలాంటి అధికారిక ప్రకటన లేదు.

ఇండస్ట్రీలోకి రాకముందే

ముక్కుకు సర్జరీ చేయించుకున్నా

– ఆసక్తికర విషయాలు బయటపెట్టిన జాన్వీ కపూర్!



బాలీవుడ్ అందాల తార, దివంగత నటి శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ తన సినీ ప్రయాణానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను బయటపెట్టారు. సినిమాల్లోకి రావడానికి ముందు తన తల్లి శ్రీదేవి పెట్టిన కండిషన్లు, ఆమె ఇచ్చిన సలహాల గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. అంతేకాదు.. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టడానికి ముందే తన ముక్కుకు సర్జరీ చేయించుకున్నట్లు కూడా చెప్పుకొచ్చారు. తొలుత తాను సినిమాల్లోకి వస్తానంటే తల్లి శ్రీదేవి పెద్దగా ఆసక్తి చూపించలేదని, అయితే ఆ తర్వాత తన నిర్ణయానికి మద్దతు ఇచ్చిందని తెలిపారు. ప్రస్తుతం జాన్వీ చేసిన ఈ వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.జాన్వీ కపూర్ తన తల్లి శ్రీదేవితో ఉన్న అనుబంధం గురించి ఎప్పటికప్పుడు పలు సందర్భాల్లో మాట్లాడుతూనే ఉంటారు. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో కూడా తన కెరీర్‌కు సంబంధించి తల్లి ఇచ్చిన సలహాలను గుర్తు చేసుకున్నారు. తాను సినిమాల్లోకి రావాలని నిర్ణయించుకున్నప్పుడు ఆ విషయాన్ని మొదట శ్రీదేవికి చెప్పానని, అయితే ఆమె వెంటనే అంగీకరించలేదని తెలిపారు. సినిమా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టడం అంటే సాధారణ విషయం కాదని, ఈ రంగంలోకి వస్తే జీవితాంతం నటనకే అంకితం కావాల్సి ఉంటుందని తన తల్లి చెప్పినట్లు వెల్లడించారు. ఈ వృత్తిలో ఎన్నో సవాళ్లు ఎదురవుతాయని, పూర్తి నిబద్ధతతో పనిచేయాల్సి ఉంటుందని శ్రీదేవి తనకు వివరించినట్లు చెప్పారు. మొదట్లో తనపై తల్లికి అంతగా నమ్మకం ఉండేది కాదని కూడా జాన్వీ పేర్కొన్నారు.ఈ ఇంటర్వ్యూలో జాన్వీ చెప్పిన మరో విషయం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. సినిమాల్లోకి రావడానికి ముందు తన ముక్కుకు సర్జరీ చేయించుకున్నట్లు ఆమె వెల్లడించారు. తన తల్లి సూచన మేరకే ఈ నిర్ణయం తీసుకున్నానని, ఆ తర్వాతే తనలో నటిగా కొనసాగగల లక్షణాలు ఉన్నాయని శ్రీదేవి భావించినట్లు చెప్పుకొచ్చారు.
అయితే జాన్వీ వ్యాఖ్యల నేపథ్యంలో ఆమె అందం, సినీ రంగ ప్రవేశానికి ముందు చేసిన మార్పుల గురించి సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. ఇప్పటికే పలుమార్లు తన వ్యక్తిగత రూపం, అందం గురించి జాన్వీ బహిరంగంగా మాట్లాడారు. అందం విషయంలో ఇతరులతో పోల్చుకోవడం సరికాదని, సోషల్ మీడియాలో కనిపించే అందమైన చిత్రాలను చూసి యువతులు తమను తాము తక్కువగా భావించుకోవద్దని సూచించారు.తన వ్యక్తిత్వం, అందం, కెరీర్‌కు సంబంధించిన ఎన్నో విషయాల్లో తల్లి ప్రభావం ఉందని జాన్వీ గతంలోనూ వెల్లడించారు.

అనుక్షణం ఉత్కంఠను రేకెత్తించే

కన్నడ క్రైమ్ థ్రిల్లర్

ఓటీటీలో!

ఈ మధ్య కాలంలో ఓటీటీ ప్లాట్ ఫామ్ పై కన్నడ సినిమాలు కాస్త గట్టిగానే సందడి చేస్తున్నాయి. కన్నడ నుంచి ఎక్కువగా క్రైమ్ .. మిస్టరీ .. సస్పెన్స్ తో కూడిన కంటెంట్ ను వదులుతున్నారు. ఈ తరహా జోనర్ నుంచి వచ్చిన సిరీస్ లు .. సినిమాలకు ప్రేక్షకుల నుంచి విశేషమైన ఆదరణ లభిస్తోంది. అలా కన్నడ నుంచి రీసెంటుగా ఓటీటీలోకి అడుగుపెట్టిన సినిమాగా ''అనిరీక్షిత అథిదిగలు' కనిపిస్తుంది. మనోజ్ అన్నయ్య దర్శకత్వం వహించిన సినిమా ఇది. వివేక్ సింహా .. మైత్రీ .. సంప్రతి .. హరిత షా ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సినిమా, సెప్టెంబర్ 18వ తేదీన అక్కడి థియేటర్లలో విడుదలైంది. స్వామినాథన్ సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమా స్ట్రీమింగ్ హక్కులను 'అమెజాన్ ప్రైమ్' వారు దక్కించుకున్నారు. వినోద్ కుమార్ భారీ బడ్జెట్ తో నిర్మించిన ఈ సినిమా, ఈ నెల 6వ తేదీ నుంచి స్ట్రీమింగ్ అవుతోంది.థియేటర్స్ వైపు నుంచి ఈ సర్వైవల్ క్రైమ్ థ్రిల్లర్ మంచి మార్కులను కొట్టేసింది. 'అనిరీక్షిత అతిథిగలు' అంటే, అనుకోని అతిథులు అని అర్థం. ఒక ప్రేమజంట సరదాగా గడపడం కోసం ఒక నిర్జన ప్రదేశంలోని గెస్టు హౌస్ కి వెళుతుంది. ఎవరూ లేని ఏకాంత ప్రదేశం దొరికినందుకు ఆ జంట సంతోష పడుతూ ఉండగా, అనుకోని నలుగురు అతిథులు అక్కడ అడుగుపెడతారు. అప్పుడు అక్కడ ఏం జరుగుతుంది? ఆ సంఘటనతో కథలో ఎలాంటి మలుపులు చోటుచేసుకుంటాయి? అనేది కథ.

బాక్సాఫీస్ వద్ద 'రామాయణ' ప్రభంజనం..

4 రోజుల్లోనే రూ.500 కోట్లకు చేరువలో వసూళ్లు!

బాలీవుడ్‌లో భారీ అంచనాల మధ్య విడుదలైన మైథలాజికల్ ఎపిక్ మూవీ



'రామాయణ' బాక్సాఫీస్ వద్ద సంచలన వసూళ్లతో దూసుకెళ్తోంది. నితీశ్ తివారీ దర్శకత్వంలో రణబీర్ కపూర్, సాయిపల్లవి, యశ్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ అందుకుంటోంది. నవంబర్ 5న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా తొలి నాలుగు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.500 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. ముఖ్యంగా దీపావళి రోజున బాలీవుడ్‌లో అత్యధిక నెట్ వసూళ్లు సాధించిన చిత్రంగా 'రామాయణ' సరికొత్త రికార్డు సృష్టించింది. ప్రముఖ ట్రేడ్ ట్రాకింగ్ సంస్థ సాక్నిల్క్ (ఘుఎఅఅశ్రీన) వెల్లడించిన వివరాల ప్రకారం.. 'రామాయణ' తొలి నాలుగు రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ.499.20 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించినట్లు సమాచారం. భారతదేశంలో ఈ చిత్రం రూ.287.64 కోట్ల గ్రాస్, రూ.240.92 కోట్ల నెట్ కలెక్షన్లను రాబట్టింది. ఇక ఓవర్సీస్ మార్కెట్‌లో సుమారు రూ.214 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ సినిమాలోని 3ణ వెర్షన్‌కు కూడా ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. 3ణ ఫార్మాట్ ద్వారా సుమారు రూ.115.46 కోట్ల వసూళ్లు వచ్చినట్లు సమాచారం. భారీ విజువల్స్, గ్రాండ్ సెట్స్, స్టార్ క్యాస్ట్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి.'రామాయణ' బాక్సాఫీస్ ప్రదర్శనలో మరో విశేషం దీపావళి రోజు సాధించిన వసూళ్లు. ఆదివారం ఒక్కరోజే భారత్‌లో రూ.56.15 కోట్ల నెట్ కలెక్షన్లు రాబట్టినట్లు ట్రేడ్ సమాచారం. దీంతో దీపావళి రోజున అత్యధిక నెట్ వసూళ్లు సాధించిన బాలీవుడ్ సినిమాగా ఈ చిత్రం నిలిచింది. ఇప్పటివరకు ఈ రికార్డు సల్మాన్ ఖాన్ నటించిన 'టైగర్ 3' పేరిట ఉండేది. ఆ సినిమా దీపావళి రోజున రూ.44.50 కోట్ల నెట్ వసూళ్లు సాధించింది. ఇప్పుడు 'రామాయణ' ఆ రికార్డును అధిగమించి సరికొత్త బెంచ్‌మార్క్ సెట్ చేసింది. అయితే తొలి వారాంతం ముగియడంతో ఇకపై వసూళ్ల వేగం ఎలా కొనసాగుతుందనేది ఆసక్తికరంగా మారింది. 'రామాయణ' నాలుగు రోజుల కలెక్షన్ల వివరాలు చూస్తే.. వరల్డ్ వైడ్ గ్రాస్: రూ.499.20 కోట్లకు పైగా వసూళ్లు సాధించగా, ఇండియా గ్రాస్: రూ.287.64 కోట్లు, ఇండియా నెట్: రూ.240.92 కోట్లు, ఓవర్సీస్ గ్రాస్: సుమారు రూ.214 కోట్లు, 3ణ ఫార్మాట్ వసూళ్లు: సుమారు రూ.115.46 కోట్లు. ఒకవైపు బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధిస్తుండగా, మరోవైపు సినిమా పైరసీ విషయంలో చిత్ర బృందం కఠినంగా స్పందించింది. థియేటర్లలో సినిమాను రహస్యంగా రికార్డు చేసి, ఆ వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంపై బాంబే హైకోర్టు సీరియస్ అయినట్లు లీగల్ నోటీసుల ద్వారా వెల్లడించింది.



పుట్టపాక సర్పంచ్ పై అగ్రకుల అహంకారం...

కులం పేరుతో దూషించిన ఉపసర్పంచ్ పై..

తిరుపతి రెడ్డి ని వెంటనే చట్టపరంగా శిక్షించాలి.



మంథని (ప్రశ్న న్యూస్) మన మాదిగ జాతి బిడ్డ మంథని మండలం పుట్టపాక గ్రామ సర్పంచ్ కన్నూరి రాజబాపు అన్నను వారి కుటుంబ సభ్యుల పై అనుచిత వ్యాఖ్యలు చేసి దుర్భాష లాడిన అగ్రకుల దురహంకారి నగరంపల్లి గ్రామ ఉపసర్పంచ్ తిరుపతి రెడ్డి గాన్ని వెంటనే అరెస్టు చేయాలని వానికి సహకరించిన మరికొందరిపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేసి అటెమ్ట్ టూ మర్డర్ కేసు నమోదు చేసి నాన్ బేలబుల్ కేసు పెట్టి కఠినంగా చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ. ఈరోజు మాదిగ జాతి బిడ్డలు అందరూ ఏకమై పుట్టపాక గ్రామపంచాయతీ సర్పంచ్ కన్నూరు రాజబాపన్న కుటుంబాన్నికి భరోసా ఇచ్చి వారికి ధైర్యం చెప్పి పుట్టపాక గ్రామ ప్రధాన రహదారిపై మాదిగల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గంట సేపు రాస్తారోకో నిర్వహించి మన జాతి బిడ్డకు న్యాయం జరగాలని డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.. ఈ కార్యక్రమంలో మంథని, ముత్తారం, రామగిరి, కమాన్ పూర్ మండలాలకు సంబంధించిన మాదిగ జాతి బిడ్డలు అధిక సంఖ్యలో పాల్గొన్నందుకు అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు ధన్యవాదాలు. ఈ కార్యక్రమంలో ఏలువుల రాజయ్య బూడిది తిరుపతి రాకేష్ మంథని లక్ష్మణ్ వైస్ ఎంపీపీ గట్టయ్య మంథని సత్యం మల్లారం సర్పంచ్ ఎస్సీ సర్పంచులు తదితరులు అందరు పాల్గొన్నారు.

మాదిగ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు



తార్నాక(ప్రశ్న న్యూస్) తెలంగాణ మాదిగ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు జోగు గణేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర తొలి ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ పిడమర్తి రవి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఉద్యమకారులకు తగిన ప్రాధాన్యత కల్పిస్తోందని, వారి సంక్షేమం కోసం ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటు చేయడంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరిన్ని సంవత్సరాలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ మాదిగ విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు జోగు గణేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు దిశగా తీసుకున్న చర్యలు, మాదిగలకు విద్య, ఉద్యోగ రంగాల్లో అవకాశాలు కల్పించే ప్రయత్నాల పట్ల ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పొన్నం ముత్యం గౌడ్, బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బోరెల్లి సురేష్, టెక్నోడిటు అధినేత దామోదర్ (సర్పంచ్), తెలంగాణ మాదిగ యూత్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు నక్క మహేష్, బీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జనగామ సంతోష్, దేవరకొండ నరేష్, డాక్టర్ ఏర్పుల యాదగిరి, ఎర్ర స్వామి, రాజు, శ్రీశైలం, సతీష్, జైసింహ, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డికి రైతు వినూత్న జన్మదిన వేడుకలు

శ్రీరంగ వరంలో వరి ధాన్యంతో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటం

ఆకట్టుకున్న చిత్రపటం, సదరు రైతుకు సన్మానం



మేడ్చల్(ప్రశ్న న్యూస్) మేడ్చల్ జిల్లా శ్రీరంగవరంలో ఆ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, రైతు బిక్షపతి తన పొలంలో వరి ధాన్యంతో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని వేసి సీఎంకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వినూత్న పద్ధతిలో సీఎం రేవంత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సదరు రైతు బిక్షపతిని శాలువా కప్పి పలువురు అభినందించారు. ఈ సందర్భంగా బిక్షపతి మాట్లాడుతూ తాను సీఎం రేవంత్ రెడ్డి అభిమానిని అని సీఎం రేవంత్ రెడ్డి చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు నచ్చి తాను వినూత్న సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఇందుకోసం తన పొలంలోని వరి గింజలతో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటం వేసి శుభాకాంక్షలు తెలిపినట్లు బిక్షపతి పేర్కొన్నారు. వినూత్న పద్ధతిలో జన్మదిన వేడుకలు జరిపిన బిక్షపతిని కాంగ్రెస్ నేతలు అభినందిస్తున్నారు.

శ్రీధర్ బాబు మౌనమే అభివృద్ధి...

- ఆయన మాట ప్రజల కష్టాలు తీర్చడానికి
- మంథని అభివృద్ధే ఆయన మంత్రం...
- పెద్దపల్లి నుండి కాళేశ్వరం వరకు నాలుగు లైన్ల రోడ్డు
- గోదావరి తీరాన మహాప్రస్థానం...
- డిపో నుండి గోదావరి వరకు నాలుగు లైన్ల రోడ్డు
- డిపో నుండి పాత పెట్రోలు బంకు మీదుగా రోడ్డు వెడల్పు ...
- మంత్రి శ్రీధర్ బాబు చొరవతో అభివృద్ధి వేగం.
- గోదావరి తీరాన పుష్కర ఘాట్లతో మంథనికిమరో కల.







మంథని (ప్రశ్న న్యూస్)మంథని నియోజకవర్గం అభివృద్ధే ఆయన మంత్రం... ఆయన లక్ష్యం గా ముందుకు దూసుక వెళు న్నారు రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపించడమే ఆయన ధ్యేయంగా పావులు కదుపుతున్నారు. ఇప్పటికీ ఇతని నియోజకవర్గ అభివృద్ధి కొరకు రాష్ట్రంలోనే కోట్లాది రూపాయలు నిధులను మంథని నియోజకవర్గానికి వేచ్చించారు. మంథనిలోని 18 ఆఫీస్ ల ప్రభుత్వ సమీకృత భవనం. అదేవిధంగా అడవి సోమనిపల్లిలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్. మంథని పట్టణంలోని 50 పడకల ప్రభుత్వాసుపత్రి తుది దశకు చేరుకుంది. ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న సహకార సంఘం బ్యాంక్. అదే విధంగా పట్టణంలోని గంగపురి వద్ద గర్మెంటరీ పనులు తుది దశకు చేరాయి. నూతన సబ్ స్టేషన్ ఇటీవల మంత్రి చేతుల మీదుగా ప్రారంభించారు. ప్రభుత్వ స్కూళ్లల్లో చదువుతున్న విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారాన్ని అందిస్తున్నారు.పెద్దపల్లి నుండి కాళేశ్వరం వరకు నాలుగు లైన్ల రోడ్డు తో పాటు అన్ని హంగులాలతో గోదావరి తీరాన మహాప్రస్థానం నిర్మాణం.డిపో నుండి గోదావరి వరకు నాలుగు లైన్ల రోడ్డు .డిపో నుండి పాత పెట్రోలు బంకు మీదుగా నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం జరగనుంది. ఇవేకాక మంథని నియోజకవర్గంలో అభివృద్ధి కొరకు అనేక నిధులను మంజూరు చేయించి... కొన్ని అభివృద్ధి పనులు పూర్తి అయ్యాయి. మరికొన్ని నిర్మాణంలో ఉన్నాయి.ఇంకొన్ని తుది దశకు చేరుకున్నాయి. ఇవన్నీ నిర్మాణ పనులు పూర్తి అయితే మంథని నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోనుంది. దీంతో మంథని ప్రాంతం రాష్ట్రంలో అగ్రగామిగా నిలవనుంది. అభివృద్ధి శ్రీధర్ బాబు మంత్రమని మంథని ప్రాంత వాసులు మేధావులు ప్రజలు ప్రజా సంఘాల నాయకులు తదితరులు రకరకాలుగా అంటున్నారు.

నీటిని వృథా చేయొద్దు..

ప్రతి నీటి చుక్కను పొదుపుగా వాడుకుందాం

ఎస్సీ సెల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుండ భానుచందర్



మేడ్చల్ (ప్రశ్న న్యూస్)ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రజలు నీటి పొదుపుపై అవగాహన కలిగి ఉండాలని నీటిని వృథా చేసేవారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని గుండ్ల పోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు కుండ భానుచందర్ డిమాండ్ చేశారు.గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో కొంతమంది ప్రజలు నీటిని విచ్చలవిడిగా వృథా చేస్తున్నారని కుండ భానుచందర్ ఆవేదన వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ప్రతి ఒక్కరూ నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచిస్తున్నప్పటికీ, కొంతమంది రోడ్లను కడగడం, వాహనాలను కడగడం కోసం విలువైన నీటిని వృథా చేస్తూ రోడ్లపై వదిలేస్తుండటం సరైన పద్ధతి కాదని అన్నారు.ఈ విషయంపై సిఎంసీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో ఉదయం, సాయంత్రం పర్యవేక్షణ చేపట్టాలని కోరారు. నీటిని వృథా చేస్తున్న వారిని గుర్తించి, ముందుగా అవగాహన కల్పించాలని, అయినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే నిబంధనల ప్రకారం జరిమానాలు విధించి కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ నీటి పొదుపును సామాజిక బాధ్యతగా భావించి, భావితరాలకు నీటి వనరులను అందించేలా బాధ్యతగా వ్యవహరించాలని కుండ భానుచందర్ కోరారు.

అంబరాన్ని అంటిన దీపావళి సంబరాలు

వెలుగుల జిలుగులతో మెరిసిపోయిన అంబరం



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) జిల్లాలో దీపావళి సంబరాలు అంబరాన్ని అంటాయి. చిన్న పెద్ద అంటూ తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఈ సంబరాలలో పాలుపంచుకున్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా ఈ పండుగను ప్రజలు కుల మతాలకు అతీతంగా ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు ప్రతి ఇల్లు ప్రమిదల వెలుగులతో రంగు రంగు విద్యుత్తు దీపాలతో కాంతులీనిది.

ప్రతి ఇంట్లో లక్ష్మీ పూజలు

పండుగ రోజు సాయంత్రం ప్రతి ఇంట్లో వ్యాపార సంస్థలోని లక్ష్మీ పూజలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇండ్లను రంగురంగుల ముగ్గులతో తోరణాలతో అందంగా అలంకరించారు . ముత్తైదువులు ప్రమిదలు వెలిగించి లక్ష్మీదేవికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి సిరిసంపదలు ప్రసాదించాల్సిందిగా వేడుకున్నారు. బంధుమిత్రులకు స్వీట్లు పంచుకొంటూ పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

చిన్న పెద్ద అంటూ తేడా లేకుండా ఆనందోత్సవాలు

రాత్రి వేళలో ఆకాశం బాణాసంచా వెలుగులతో మెరిసిపోయింది. చిన్న పెద్ద అంటూ తేడా లేకుండా అందరూ కలిసి చిచ్చుబుట్లు భూచక్రాలు అటం బాంబులు రాకెట్లు కాల్చి సంబరాలను జరుపుకున్నారు. ఈ ఏడాది పండుగలో ఓ ప్రత్యేకత కనిపించింది. చాలా ప్రాంతాలలో ప్రజలు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతను ఇస్తూ గ్రీన్ క్రాకర్స్ వైపు మొగ్గు చూపారు . కాలుష్యాన్ని తగ్గిస్తూ కేవలం వెలుగులు పంచాల పండుగను జరుపుకున్నారు.

సదర్ వేడుకల్లో ఎమ్మెల్యే మల్లారెడ్డి సందడి

ఉత్సాహంగా స్టెప్పులు



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని మేడ్చల్ సర్కిల్ కిస్టాపూర్ పూడూరు డివిజన్ పరిధి లోని పూడూరులో సదర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మల్లారెడ్డి వేడుకల్లో సందడి చేశారు. ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం సైతం పూడూరులో సదర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మల్లారెడ్డి తనదైన స్టైల్ లో స్టెప్పులు వేస్తూ కార్యక్రమంలో సందడి చేశారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి ఉత్సాహభరితమైన స్టెప్పులను చూసి బి ఆర్ఎస్ నేతలు కార్యకర్తలు, ఆనందం వ్యక్తం చేశారు. .ఈ సందర్భంగా ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ సదరు ఉత్సవాలను పురస్కరించుకొని యాదవులందరూ పశువులను పూజిస్తారని పేర్కొన్నారు.తాను కూడా చిన్నప్పుడు పశువులను పెంచి ఈ స్థాయికి వచ్చానని తెలిపారు. 50 సంవత్సరాల క్రితం తాను కూడా సదరు ఉత్సవాలను ఘనంగా నిర్వహించినట్లుగా చెప్పారు. గ్రామస్తులందరూ కులమత బేధాలు లేకుండా సదరు ఉత్సవాలను సంతోషంగా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ భాస్కర్ యాదవ్, మాజీ సర్పంచ్ బాబు యాదవ్, మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్,పెద్ద గొల్ల శ్రీశైలం యాదవ్, మాజీ కౌన్సిలర్లు మధుకర్ యాదవ్,స్వామి యాదవ్, శ్రీ కృష్ణ యాదవ సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్, మాజీ వార్డు సభ్యులు కోలా వెంకటేష్ ,శేఖర్ రెడ్డి, జనార్ధన్ యాదవ్, శేషి కుమార్ యాదవ్, శ్రీకాంత్ ముదిరాజ్, హన్మంత్ రెడ్డి, రేగు నగేశ్, నాయకులు అకిటి నవీన్ రెడ్డి, బాసుపల్లి రాంరెడ్డి, కటకం లక్ష్మణ్, డప్పు కృష్ణ, మాజీ కౌన్సిలర్ తుడుం గణేష్, మాజీ సొసైటీ చైర్మన్ సత్తి రెడ్డి, యాదవ సంఘం నాయకులు మల్లేష్ యాదవ్, గోపాల్ యాదవ్, కృష్ణ యాదవ్ ,రాములు యాదవ్, శ్రీశైలం యాదవ్, అనిల్ యాదవ్, నిమ్మల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ రోగులకు శుభవార్త

137 ఔషధాల ధరలు భారీగా తగ్గింపు

న్యూఢిల్లీ దేశంలోని క్యాన్సర్ పేషంట్లకు భారీ ఊరట కలిగింది. క్యాన్సర్ మందుల ట్రేడ్ మార్జిన్లపై 30 శాతం పరిమితి విధిస్తూ జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త ధరలు నేటి నుంచే అమల్లోకి వచ్చాయి.137 రకాల క్యాన్సర్ ఔషధాల గరిష్ఠ విక్రయ ధరల్లో 96.45 శాతం వరకు కోత విధించారు. రొమ్ము క్యాన్సర్ మందు 'పాల్‌బోప్రో' ధర రూ.40,421 నుంచి రూ.2,720కి తగ్గగా.. ప్రొస్టేట్ క్యాన్సర్ మందు 'అబిరోన్' ధర రూ.41,250 నుంచి రూ.3,218కి పడిపోయింది. కొత్త ధరల జాబితాలను ఆసుపత్రులు, రిటైలర్లు, డీలర్లు తమ బోర్డులు, వెబ్‌సైట్లలో ప్రదర్శించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది.

ఏపీలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు నగారా

- మూడు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు

అమరావతి రాష్ట్రంలో మూడు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నెల 13న తొలి విడత ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకానుంది. 26న తొలి విడత పోలింగ్, ఫలితాలు వుంటాయి. 16న రెండో విడత ఎన్నికల నోటిఫికేషన్, 29న రెండో విడత పోలింగ్, రిజల్ట్ ప్రకటిస్తారు. 19న మూడో విడత ఎన్నికల నోటిఫికేషన్ డిసెంబర్ 2న పోలింగ్, ఫలితాలు విడుదలవుతాయి. మూడు విడతల్లో 13,354 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. తొలి విడత నామినేషన్లకు ఈ నెల 17 చివరి తేదీ, రెండో విడత నామినేషన్లకు ఈ నెల 20 చివరి గడువు, మూడో విడత నామినేషన్లకు ఈ నెల 23 చివరి తేదీ

నల్లగండ్ల హుడా లేఅవుట్‌లో అక్రమ అంతస్తుల దందా

- అనుమతులు రెండు అంతస్తులకు, నిర్మాణాలు ఆరు అంతస్తులకు
- కళ్లముందే నిబంధనల ఉల్లంఘన, పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు
- అధికారుల అండదండలతోనే అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయా.?
- ఉన్నతాధికారులు స్పందించకుంటే అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడేదెప్పుడు.?
- అక్రమ నిర్మాణాలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిఎంసి కమిషనర్





శేరిలింగంపల్లి (ప్రశ్న న్యూస్) శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని నల్లగండ్ల హుడా లేఅవుట్‌లో భవన నిర్మాణ నిబంధనలు బహిరంగంగా ఉల్లంఘిస్తున్నారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలు, పట్టణ ప్రణాళిక అనుమతులు తమకు వర్తించవన్నట్లుగా కొందరు నిర్మాణదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్టిల్ట్ తో పాటు మరో రెండు అంతస్తుల నిర్మాణానికి అనుమతులు తీసుకొని, ఏకంగా ఆరు అంతస్తుల వరకు నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

అనుమతులకు మించి నిర్మాణాలు

భవన నిర్మాణానికి అనుమతులు ఇచ్చే సమయంలో అధికారులు నిర్దేశించిన అంతస్తులు, విస్తీర్ణం, భవన నిర్మాణ ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. కానీ నల్లగండ్ల హుడా లేఅవుట్‌లో మాత్రం అనుమతులకు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న నిర్మాణాలకు పొంతనే ఉండటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్టిల్ట్ తో రెండు అంతస్తులకే అనుమతి పొంది, అదనంగా మరో నాలుగు అంతస్తులు నిర్మిస్తున్నారనే ఆరోపణలు అధికారుల పనితీరుపై అనేక అనుమానాలకు తావిస్తున్నాయి. అనుమతుల ఉల్లంఘనలను అడ్డుకోవాల్సిన అధికారులు మామూలు తీసుకొని ఎక్కడున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

కళ్లముందే అక్రమ నిర్మాణాలు, అధికారులకు కనిపించడం లేదా.?

అక్రమ నిర్మాణాలు ఒక్కరోజులో పూర్తయ్యేవి కావు. పునాదుల నుంచి పిల్లర్లు, స్లాబుల వరకు ఒక్కో దశలో నిర్మాణాలు సాగుతుంటాయి. ఇంతటి భారీ నిర్మాణాలు జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారుల దృష్టికి రాకపోవడం విడ్డూరంగా ఉందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్న వారిని గుర్తించి తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మౌనం వహించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చేతులు కాలాక చర్యలా.? ఇప్పుడే మేల్కొనరా.?

అక్రమ నిర్మాణాలు పూర్తయిన తర్వాత నోటీసులు జారీ చేయడం, సీజ్ చేసినట్లు ప్రకటించడం, ఆపై నిర్మాణాలు తిరిగి కొనసాగడం వంటి పరిస్థితులకు అవకాశం ఇవ్వకూడదని స్థానికులు కోరుతున్నారు. నిర్మాణం ప్రారంభ దశలోనే అధికారులు స్పందిస్తే నిబంధనల ఉల్లంఘనలను అరికట్టవచ్చని చెబుతున్నారు. నిర్మాణాలు పూర్తయిన తర్వాత చర్యల పేరుతో అధికారులు కాలయాపన చేస్తే ప్రభుత్వ నిబంధనలకు విలువ లేకుండా పోతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కమిషనర్,ఉన్నతాధికారులు స్పందించాలి

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ స్పందించి శేరిలింగంపల్లి పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు నల్లగండ్ల హుడా లేఅవుట్‌లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఆయా భవనాలకు మంజూరైన అనుమతులు, నిర్మాణాల వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అనుమతులకు మించి నిర్మించినట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సెక్షన్ ఆఫీసర్, ఏసిపి, డిప్యూటీ కమిషనర్, జోనల్ సిపి, జోనల్ కమిషనర్ అధికారుల నిర్లక్ష్యంపై కూడా ఉన్నతస్థాయి విచారణ జరపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అనుమతులు రెండు అంతస్తులకే ఉంటే ఆరు అంతస్తుల నిర్మాణాలు ఎలా సాగుతున్నాయి.? అధికారులు ఇంత భారీ మొత్తంలో లంచాలు ఎంత తీసుకున్నారు.? నిర్మాణం పూర్తయ్యే వరకు అధికారులు ఏం చేస్తున్నారు.? ఈ వ్యవహారంపై కమిషనర్, ఉన్నతాధికారులు ఎప్పుడు స్పందిస్తారు.? అక్రమ నిర్మాణదారులపై చర్యలు తీసుకుంటారా.? లేక చూసీచూడనట్లు వ్యవహరిస్తారా.? అనేది వేచి చూడాలి.

పోలీస్ స్టేషన్‌ల సాక్షిగా ఎస్ఐ, సిఐల అవినీతి దందా.?

- బాధితులకు న్యాయం చేస్తారా.? లంచాలు తీసుకొని అన్యాయం చేస్తున్నారా.?
- కీసర పోలీస్ స్టేషన్ కేంద్రంగా అవినీతి కలకలం
- మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎస్ఐ, సిఐ ల బయటపడుతున్న అవినీతి అక్రమాలు
- ఎస్ఐ, సిఐ లకు సహకరిస్తున్న ఏసీపీ లను ఏసీబీ ఎందుకు ప్రశ్నించడం లేదు
- పోలీస్ స్టేషన్ లపై డీసీపీ, అడిషనల్ సీపీ, సీపీ ల పర్యవేక్షణ ఎక్కడ.?
- పోలీస్ స్టేషన్లో గంటలకొద్దీ బాధితులను కూర్చోబెట్టడం సెటిల్మెంట్ల కోసమేనా.?
- కొందరి అధికారుల వల్ల పోలీసు శాఖకే చెడ్డ పేరు. ఏసీబీలో దొరికితే ఉద్యోగం నుండి శాశ్వతంగా తొలగించండి
- అధికార బలంతో, ఆర్థిక ఒప్పందాలు చేసుకొని తప్పుడు కేసులు పెడుతున్న పోలీసులు





కీసర(ప్రశ్న న్యూస్) పోలీసులు అంటే ఒక నమ్మకం ఉండేది కానీ ఎలాంటి ఇబ్బందులు కలిగిన ఆదుకుంటారన్న నమ్మకం ఉండేది, కానీ ఇటీవల కొంతమంది ఎస్సై, సిఐల వ్యవహారం చూస్తుంటే పోలీస్ స్టేషన్లో అంటేనే ప్రజలు అవినీతి కేంద్రాలుగా చూస్తున్న పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇక్కడ రాజకీయ పలుకుబడి లంచాల వ్యవహారం చేసిన వాళ్లకే పోలీసులు న్యాయం చేస్తున్నారన్న ప్రజల ఆరోపణలకు ఇటీవల పోలీసులు చేస్తున్న అవినీతి అక్రమాలకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ప్రభుత్వం ఇచ్చే జీతాలు, ఏసీ కార్లు, ఏసీ గదులు సరిపోతలేదు అన్నట్లుగా పోలీసు ఉద్యోగం అంటేనే అక్రమ సంపాదనకు నిలయం అన్నట్లుగా కొంతమంది అధికారులు ధన దాహంతో లంచాలు లంచాలు అంటూ పోలీసు శాఖ పరువు తీస్తున్నారు. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కీసర పోలీస్‌స్టేషన్‌లో మరో అవినీతి వ్యవహారం వెలుగులోకి వచ్చింది. కేసు చార్జిషీట్‌లో అనుకూలంగా వ్యవహరించడంతోపాటు త్వరగా దాఖలు చేసేందుకు లంచం డిమాండ్ చేసిన ఎస్ఐ కొండారెడ్డి శ్రీనివాస్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. బాధితుడి నుంచి రూ.2 లక్షలు స్వీకరిస్తుండగా నాగారం పరిధిలోని శిల్పానగర్ కాలనీలో సోమవారం ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఈ వివరాలను హైదరాబాద్ ఏసీబీ డీఎస్పీ గంగసాని శ్రీధర్ వెల్లడించారు.

రూ.5 లక్షలు డిమాండ్.. రూ.2 లక్షలకు ఒప్పందం

కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిపై చీటింగ్, 498ఏ కేసులు నమోదయ్యాయి. బెయిల్‌పై ఉన్న సదరు వ్యక్తి కోర్టు ఆదేశాల మేరకు ప్రతి సోమవారం పోలీస్‌స్టేషన్‌లో హాజరవుతున్నాడు. ఈ క్రమంలో కేసు చార్జిషీట్‌లో అనుకూలంగా వ్యవహరించడంతోపాటు త్వరగా దాఖలు చేసేందుకు ఎస్ఐ కొండారెడ్డి శ్రీనివాస్ రూ.5 లక్షలు డిమాండ్ చేసినట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. అంత మొత్తం చెల్లించలేనని బాధితుడు చెప్పడంతో చివరకు రూ.2 లక్షలకు ఒప్పందం కుదిరిందని వెల్లడించారు. నగదు చెల్లించాలని ఎస్ఐ పలుమార్లు ఫోన్ చేసి ఒత్తిడి తెచ్చినట్లు పేర్కొన్నారు.

శిల్పానగర్‌లో ఏసీబీ వల.. రెడ్‌హ్యాండెడ్‌గా పట్టివేత

ఎస్ఐ లంచం డిమాండ్‌తో విసిగిపోయిన బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనల మేరకు రూ.2 లక్షల నగదును కవర్లో పెట్టుకుని నాగారం పరిధిలోని శిల్పానగర్ కాలనీకి వెళ్లాడు. అక్కడ బాధితుడి నుంచి ఎస్ఐ నగదు స్వీకరిస్తుండగా ముందస్తు ప్రణాళికతో ఉన్న ఏసీబీ బృందం దాడి చేసి పట్టుకుంది. అనంతరం ఎస్ఐను అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచేందుకు చర్యలు చేపట్టినట్లు డీఎస్పీ గంగసాని శ్రీధర్ తెలిపారు.

లంచం అడిగితే 1064కు ఫిర్యాదు చేయాలి


ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు భయపడకుండా ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని డీఎస్పీ సూచించారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

కీసరలో వరుస ఏసీబీ కేసులతో కలకలం

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలోని ప్రభుత్వ అధికారులకు ధన దాహం తగ్గడం లేదు ప్రజలను పీల్చి పిప్పి చేసి లంచాల రూపంలో డబ్బులు వసూలు చేయడం సర్వసాధారణంగా మారింది ఉన్నత అధికారుల పర్యవేక్షణ అసలు లేకపోవడంతో అడ్డేమీ లేదన్నట్లుగా కిందిస్థాయి అధికారులు సిబ్బంది లంచాలే పరమ అవధిగా ప్రతి శాఖలో విధులు నిర్వహించడం సర్వసాధారణంగా మారింది. కీసర ప్రాంతంలో ఈ ఏడాది వరుసగా వెలుగుచూస్తున్న ఏసీబీ కేసులు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. ఫిబ్రవరిలో హోంగార్డు నగేష్ వ్యవహారం, సెప్టెంబర్ 17న కీసర సీఐ, ఎస్ఐలపై చర్యలు, అక్టోబర్ 15న డిప్యూటీ తహసీల్దార్ ఉదంతం.. తాజాగా నవంబర్ 9న ఎస్ఐ కొండారెడ్డి శ్రీనివాస్ అరెస్టు ఘటనతో ప్రభుత్వ శాఖల్లో అవినీతి అంశం మరోసారి చర్చకు వచ్చింది. పోలీస్, రెవెన్యూ శాఖల్లో వరుస ఘటనలు వెలుగుచూస్తుండటంతో ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి నిరోధక చర్యలు, ఉన్నతాధికారుల పర్యవేక్షణపై ప్రజలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.

శ్రీవారికి పుష్పాభిషేక వైభవం

- నవంబరు 16న తిరుమలలో పుష్పయాగ మహోత్సవం
- సుగంధ పుష్పాలు.. సుమనోహర పత్రాలతో స్వామివారికి విశేష సేవ
- 15న అంకురార్పణ.. 16న మధ్యాహ్నం 1 నుంచి 5 గంటల వరకు పుష్పయాగం



తిరుమల(ప్రశ్న న్యూస్) కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారికి నవంబరు 16న పుష్పయాగ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది. సుగంధభరిత పుష్పాలు, పవిత్ర పత్రాలతో స్వామివారికి అర్చనాభిషేకాలు సమర్పించే ఈ విశేష ఉత్సవం శాస్త్రోక్తంగా జరగనుంది. నవంబరు 15న సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు పుష్పయాగానికి అంకురార్పణ నిర్వహించనున్నారు.

పాలాభిషేకంతో స్నపన తిరుమంజనం..

పుష్పయాగం రోజున ఆలయంలో రెండవ అర్చన, రెండవ గంట, నైవేద్యం పూర్తయిన అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారిని సంపంగి ప్రదక్షిణంలోని కల్యాణమండపానికి వేంచేపు చేస్తారు. అక్కడ స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుగంధ ద్రవ్యాలతో ఉత్సవమూర్తులకు విశేష అభిషేకం సమర్పిస్తారు.

నాలుగు గంటలపాటు పుష్పార్చన..

మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వివిధ రకాల పుష్పాలు, పత్రాలతో పుష్పయాగాన్ని కన్నులపండువగా నిర్వహిస్తారు. భక్తి, పరిమళాల సమ్మేళనంగా సాగే ఈ వేడుకలో స్వామివారికి పుష్ప సమర్పణ విశేష ఆకర్షణగా నిలవనుంది. అనంతరం సాయంత్రం సహస్రదీపాలంకార సేవ నిర్వహిస్తారు. ఆ తర్వాత శ్రీమలయప్పస్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తారు.

ఆర్జిత సేవలు రద్దు..

పుష్పయాగ మహోత్సవం నేపథ్యంలో నవంబరు 16న కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, బ్రహ్మోత్సవం ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది. భక్తులు ఈ మార్పును గమనించి శ్రీవారి దర్శన ఏర్పాట్లకు అనుగుణంగా తమ యాత్రను ప్రణాళిక చేసుకోవాలని టీటీడీ సూచించింది.

ఇంద్రకీలాద్రిపై గాజుల మహోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు

- ఈసారి రెట్టింపు గాజులతో అమ్మవారి దివ్య అలంకరణ
- మహిళా భక్తులకు అమ్మవారి ప్రసాదంగా పవిత్ర గాజుల పంపిణీ
- ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈవో వి.కె. శీనా నాయక్ వెల్లడి



విజయవాడ(ప్రశ్న న్యూస్) కార్తీక మాస ఆధ్యాత్మిక శోభలో ఇంద్రకీలాద్రి మరో విశేష పర్వానికి సిద్ధమవుతోంది. కార్తీక శుద్ధ విదియ సందర్భంగా ఈ నెల 11న శ్రీ కనకదుర్గ అమ్మవారికి నిర్వహించనున్న గాజుల అలంకారోత్సవానికి దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ సంప్రదాయాలు, ఆనవాయితీలకు అనుగుణంగా అమ్మవారి దివ్య అలంకరణతో పాటు ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు దేవస్థానం ఈవో వి.కె. శీనా నాయక్ వెల్లడించారు.

గతేడాది కంటే రెట్టింపు గాజులతో అలంకరణ..

మహా మండపం ఆరో అంతస్తులో జరుగుతున్న గాజుల అలంకరణ ఏర్పాట్లను పరిశీలించిన ఈవో.. గత ఏడాది నాలుగు లక్షలకు పైగా గాజులతో ఆలయ ప్రాంగణాన్ని అలంకరించినట్లు గుర్తుచేశారు. ఈ ఏడాది అంతకు రెట్టింపు సంఖ్యలో గాజులతో అమ్మవారి మూలవిరాట్‌తో పాటు ఆలయ ప్రాంగణమంతా శోభాయమానంగా తీర్చిదిద్దేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

భక్తుల విరాళాలతో గాజుల సమీకరణ..

అమ్మవారి గాజుల మహోత్సవం కోసం భక్తులు, దాతలు స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో గాజులను విరాళంగా అందిస్తున్నారని ఈవో తెలిపారు. అలంకరణకు అవసరమైన గాజులు ఇంకా ఏవైనా ఉంటే దేవస్థానం తరఫున సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. భక్తుల సహకారంతో ఈ ఏడాది గాజుల అలంకారోత్సవాన్ని మరింత వైభవంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు.

మహిళా భక్తులకు అమ్మవారి దివ్య ప్రసాదం..

గాజుల అలంకరణ మహోత్సవం అనంతరం అమ్మవారి సన్నిధిలో పూజించిన పవిత్ర గాజులను దర్శనానికి వచ్చే మహిళా భక్తులకు అమ్మవారి దివ్య ప్రసాదంగా పంపిణీ చేయనున్నట్లు ఈవో తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో కూడిన ఈ పవిత్ర గాజులను స్వీకరించేందుకు మహిళా భక్తులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు..

విశేష పర్వదినం సందర్భంగా ఇంద్రకీలాద్రికి తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. క్యూలైన్లు, తాగునీరు, ప్రసాద వితరణ తదితర సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఈవో వెల్లడించారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588